వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 12
సోమవారం, 30 సెప్టెంబర్, 2024
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఆర్టీసీకి రూ.1,263 కోట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్:** ఆర్టీసీ బస్సుల్లో సగటున నిత్యం అరకోటి మందికిపైగా ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి పథకానికి ముందు బస్సుల్లో రోజుకు 45.49 లక్షల మంది ప్రయాణాలు సాగించగా... ఉచిత ప్రయాణంతో మరో 12.22 లక్షల మంది పెరిగారు. ప్రస్తుతం నిత్యం 57.71 లక్షల మందిని ఆర్టీసీ గమ్యస్థానాలకు చేరుస్తోంది. మహిళల - మిగతా 2వ పేజీలో

## 'మూసీ'కి లక్షల జీవితాలు బలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
### సీఎం రేవంత్ తీరును ఎండగడుతూ వాగ్బాణాలు
### సోషల్ మీడియా 'ఎక్స్'వేదికగా వరుస పోస్టులు

**హైదరాబాద్:** 'రూ. లక్షన్నర కోట్ల మూసీ ధనదాహానికి బలవుతున్న జీవితాలు లక్షల్లో ఉన్నాయి మిస్టర్ చీఫ్ మినిస్టర్' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - మిగతా 2వ పేజీలో

# మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

## పింక్ పవర్ రన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ - రాయదుర్గం:** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం సంతోషంగా ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలో మరిన్ని ఆసుపత్రులు నిర్మించి వైద్య రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పింక్ పవర్ రన్ 2024' కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన 'పింక్ పవర్ రన్' చాలా గొప్ప కార్యక్రమమని కొనియాడారు. అనారోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళలకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా సంఘీభావం తెలపడం అభినందనీయమన్నారు. అనంతరం పింక్‌పవర్ 5కే, 10కే రన్ విభాగాల్లో గెలుపొందినవారికి ముఖ్యమంత్రి నగదు బహుమ



తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధారెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కృష్ణారెడ్డి, సుధారెడ్డి సంయుక్తంగా 3కే, 5కే, 10కే పరుగును జెండా ఊపి ప్రారంభించగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖ ప్రక్షాళన..

### గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దేలా త్వరలో కొత్త రెవెన్యూ చట్టం
### ఈ శాఖ సమర్థ పనితీరుతోనే ప్రభుత్వానికి మంచిపేరు
### తహసీల్దార్ల సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**శామీర్‌పేట:** 'ప్రభుత్వానికి, ప్రజలకు రెవెన్యూ శాఖ వారధి.. ఈ విభాగం సమర్థంగా పనిచేసినప్పుడే నిర్దేశించిన లక్ష్యాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేరి.. ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ప్రభుత్వానికి మంచి పేరొస్తుంది. ప్రజలు కోరుకున్న రీతిలో రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తోందా.. లేదా.. ఆత్మపరిశీలన చేసుకుంటూ ముందుకెళ్లాలి' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్యోగులకు సూచించారు. కొందరు రెవెన్యూ అధికారుల తీరు వల్ల శాఖకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని.. అలాంటివారు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. హైదరాబాద్ శివార్లలోని శామీర్‌పేటలో ఉన్న నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం తహసీల్దార్లతో నిర్వహించిన సదస్సులో మంత్రి ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 972 మంది తహసీల్దార్లు హాజరవగా.. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న పలు సమస్యలను కొందరు తహసీల్దార్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'రాష్ట్రంలో గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపరిచిన విధానాన్ని, చేసిన తప్పులను సరిదిద్దుతాం. వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా పటిష్ఠమైన కార్యాచరణ చేపడుతున్నాం. త్వరలో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నాం. గత ప్రభుత్వం హడావుడిగా - మిగతా 2వ పేజీలో

# 116 కి.మీ. 80 స్టేషన్లు




## మొత్తం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.32,237 కోట్లు
## రెండోదశ మెట్రోపై వివరాలు వెల్లడించిన ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్:** రెండోదశలో భాగంగా మొత్తం ఆరు కారిడార్లలో 116.2 కిలోమీటర్ల మేర 80కు పైగా స్టేషన్లతో మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఎయిర్‌పోర్ట్‌తో పాటు, కొత్తగా ప్రతిపాదించిన ఫోర్త్‌సిటీతో సహా నగరంలోని వివిధ మార్గాల్లో మెట్రో సేవలను విస్తరించనున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రెండోదశ ప్రాజెక్టు డీపీఆర్‌లకు తుదిమెరుగులు దిద్దుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. 40 కి.మీ పొడవుతో కొత్తగా ప్రతిపాదిస్తున్న ఎయిర్‌పోర్ట్ టూ ఫోర్త్ సిటీ కారిడార్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) మినహా మిగతా ఐదు కారిడార్ల డీపీఆర్‌లను త్వరలోనే కేంద్రానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ టూ ఫోర్త్ సిటీ డీపీఆర్ ఆకర్షణీయమైన ఫీచర్లతో రూపుదిద్దుకుంటోందని, మరికొద్ది నెలల్లో దీన్ని కేంద్రం అనుమతి కోసం పంపుతామని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌లో మార్పు చేస్తూ కొత్తగా డీపీఆర్ సిద్ధం చేసినట్లు వివరించారు. మెట్రో రైలు రెండోదశపై ఆదివారం బేగంపేట్ మెట్రో భవన్‌లో ఆయన సవివరమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు.

### ట్రాఫిక్ అధ్యయనం

'రెండోదశకు సంబంధించి హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో ప్రస్తుతం ట్రాఫిక్ అధ్యయనం కొనసాగుతోంది. త్వరలో రూపొందించనున్న ట్రాఫిక్ అధ్యయన - మిగతా 2వ పేజీలో

**రెండో దశ కారిడార్లు ఇవీ (కిలో మీటర్లలో)**

| | |
|---|---|
| కారిడార్ - 4 నాగోల్ - ఎయిర్‌పోర్ట్ | 36.6 |
| కారిడార్-5 రాయదుర్గం-కోకాపేట్ నియోపొలిస్ | 11.6 |
| కారిడార్ - 6 ఎంజీబీఎస్ -చాంద్రాయణగుట్ట | 7.5 |
| కారిడార్ - 7 మియాపూర్ - పటాన్‌చెరు | 13.4 |
| కారిడార్-8 ఎల్‌బీనగర్-హయత్ నగర్ | 7.1 |
| కారిడార్-9 ఎయిర్‌పోర్ట్- ఫోర్త్ సిటీ | 40 |

# రూ.5వేలు ఇచ్చి మాట్లాడిస్తున్నారు

- మూసీపై సీఎంకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు
- పేదలను నిలబెట్టాలనుకుంటున్నాం.. పడగొట్టడం మా ఉద్దేశం కాదు
- ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు... పునరావాసం కోసం హైలెవల్ కమిటీ
- మూసీ, హైడ్రా విషయంలో కలెక్టరేట్‌లలో హెల్ప్‌డెస్క్‌లు: మంత్రి డి.శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:** అవకాశవాద శక్తులు మూసీ ప్రక్షాళన విషయంలో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ మొసలికన్నీరు కారుస్తోందని, భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇందుకోసం రూ.5వేలు ఇచ్చి సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలను నిలబెట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, పడగొట్టాలన్నది కాదని స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితులను కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో చెరువులు, మూసీ ఆక్రమణలను తొలగిస్తున్నామని, ఇందులో నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని, వారిని కాపాడుకునే బాధ్య త తమదని భరోసా ఇచ్చారు. 35 బృందాలతో సామాజిక, ఆర్థిక సర్వే చేయిస్తున్నామని, వాక్‌టూ వర్క్ పద్ధతిలో నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. పునరావాసం కోసం హైలెవల్ కమిటీ పనిచేస్తుందని చెప్పారు. రివర్‌బెడ్‌లోని నివాసాలకు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆరేళ్లు చదివిస్తామని, మహిళలకు వడ్డీ లేని రుణాలిప్పిస్తామని చెప్పారు. మూసీకి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ బ్లూ ప్రింట్ - మిగతా 2వ పేజీలో



## ప్రజల ఆస్తులు కాపాడడం ప్రభుత్వ బాధ్యత

### శాన్‌ఫ్రాన్సిస్కోలోని తెలుగు వారితో ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్:** ప్రజల ఆస్తులు కాపాడడం తమ బాధ్యతని, అందులో భాగంగానే తెలంగాణలో చెరువులను రక్షించేందుకు చర్యలు చేపట్టామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. అభివృద్ధి, స్వేచ్ఛకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం శాన్‌ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్న తెలుగువారు మీట్ అండ్ గ్రీట్ అనే పేరుతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సులేట్

- మిగతా 2వ పేజీలో

# మీ కన్నీళ్లు చూస్తుంటే..

## రాతి గుండె కూడా కరిగిపోతుంది

### కానీ రేవంత్ గుండె ఎందుకు కరుగతలేదో..
### రాష్ట్ర ప్రభుత్వానికి మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక



**బండ్లగూడ:** రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని.. ప్రజల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరే షన్ పరిధిలో ఉన్న గంధంగూడ, బైరాగిగూడ మూ సీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ ఆలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ స్పీకర్ మధుసూద నాచారి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, - మిగతా 2వ పేజీలో

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమా?: బండి సంజయ్

**హైదరాబాద్:** తెలంగాణలో హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తప్పకుండా తగులుతుందన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చడమా? అంటూ ప్రశ్నించారు. అలాగే, ప్రభుత్వం ఇప్పుడికైనా హైడ్రాపై సమీక్ష చేయాలన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. కిషన్ రెడ్డి రాగానే హైడ్రాపై బీజేపీ కార్యాచరణ ప్రకటిస్తాం. పేదలకు బీజేపీ అండగా ఉంటుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం. బుల్డోజర్లు ముందుగా మామీద నుండి వెళ్లాలి. అప్పుడే పేదల ఇళ్ల వద్దకు బుల్డోజర్లు వెళ్తాయి. తెలంగాణలో హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తగులుతుంది. ఎన్ని ఇబ్బందులు తలెత్తిన అధికారులతో మీడియా సమావేశం పెట్టి తప్పును



కప్పి పుచ్చుకుంటున్నారు. ఇందిరా రాజ్యం అంటే పేదల ఇళ్ళు కూల్చడమా?. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. భూమి పట్టాలు, లింకు డాక్యుమెంట్స్, గ్రామా పంచాయితీ అనుమతి ఉన్న వారి ఇళ్లను కూడా కూల్చివేస్తున్నారు. అందులో ఉన్న వాళ్లంతా పేదలే. హైడ్రా వల్ల ప్రభుత్వ ఆర్థిక - మిగతా 2వ పేజీలో

# ప్రజల ఆస్తులు కాపాడడం ప్రభుత్వ బాధ్యత

మొదటి పేజీ తరువాయి

జనరల్ సంయుక్తంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'గతంలో ఫ్యూడల్ మనస్తత్వం గల నేతల చేతుల్లో బందీ అయిన తెలంగాణను పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చాం. ఎవరు ఏ భావజాలాన్నైనా వ్యక్తపరిచే వాతావరణం కల్పించాం. అమెరికాలో స్థిరపడిన మన వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలి. పెట్టుబడులతో ముందుకు రావాలి. హైదరాబాద్ అంటేనే కొండలు, చెరువులు, పార్కులు అనే పేరుండేది. అక్రమ నిర్మాణాలతో అవన్నీ కనుమరుగయ్యాయి. ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరిస్థితులు హైదరాబాద్‌లోనూ ఏర్పడతాయి. నదీగర్భంలో నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని ఇప్పటికైనా ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది. పేదలను అడ్డంపెట్టి బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు. వందల చెరువులు కనపడకుండా పోయాయి. వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టాం. మూసీ నదిలో మంచినీటిని పారిస్తాం. మూసీ నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపడుతున్నాం. వారంతా మంచి వాతావరణంలో జీవించేలా చూడడమే మా ప్రభుత్వ ఉద్దేశం. పరీవాహక ప్రాంతంలోని కుటుంబాలు ఆరోగ్యంగా జీవించేలా మూసీ నదిని శుద్ధి చేస్తాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం' అని వివరించారు.

# రెవెన్యూ శాఖ ప్రక్షాళన..

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన కొత్త మండలాలకు భవనాలు, సిబ్బంది, మౌలిక వసతులు కల్పిస్తాం. పదోన్నతులు, కోర్టు ఖర్చులు, అద్దె భవనాలు, వాహనాల బకాయిలతోపాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసీల్దార్ల తిరుగు బదిలీలపై ఉద్యోగ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు కాపాడే విషయంలో, పేదలకు సహాయం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ.. ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి. తహసీల్దార్లపై కేసుల నమోదు విషయంలో జిల్లా కలెక్టర్ల నుంచి అనుమతి తీసుకునేలా డీజీపీతో చర్చించి త్వరలో ఉత్తర్వులు జారీచేస్తాం. రెవెన్యూ సిబ్బంది శిక్షణకు హైదరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం' అని మంత్రి వివరించారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 300 మంది ఉద్యోగుల వైద్య ఖర్చుల బిల్లుల చెల్లింపు దస్త్రాలను మంత్రి పరిష్కరించారని నవీన్ మిత్తల్ వెల్లడించారు. సమావేశంలో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతంకుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## నాడు సర్కారు భూమికి పట్టా ఇవ్వాలని బెదిరించారు!

### మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లిన తహసీల్దార్

**హైదరాబాద్:** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయి అధికారి ఒకరు తనను హైదరాబాద్‌కు పిలిచి 300 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టా జారీ చేయాలని ఆదేశించారని.. వీలు కాదన్నందుకు తన సర్వీసు రికార్డులన్నింటినీ తనిఖీ చేయించి కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామంటూ బెదిరించారని వరంగల్ జిల్లాకు చెందిన ఓ తహసీల్దార్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు రాష్ట్రంలోని తహసీల్దార్లతో మంత్రి ఆదివారం నిర్వహించిన ముఖాముఖి సదస్సు సందర్భంగా పలువురు అధికారులు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ మేరకు పలు జిల్లాలకు చెందిన తహసీల్దార్లు వివిధ అంశాలను ప్రస్తావించగా మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

# మీ కన్నీళ్లు చూస్తుంటే..

మొదటి పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు మాలతీనాగరాజ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాల్ నగర్ కాలనీ నుంచి కేంద్రీయ విహార్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### ఫోన్ చేయండి.. అరగంటలో మీ ముందుంటా

మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా నిలుస్తామని హరీశ్‌రావు చెప్పారు. 'ఆపదొస్తే ఫోన్ చేయండి... అర్ధ గంటలో మీ ముందుంటా. బుల్డోజర్లు వచ్చినా, జేసీబీలు వచ్చానా ముందు మమ్మల్ని దాటాలి' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ తీరుపై విరుచుకుపడ్డారు. 'బలిసినోళ్ల కు దగ్గరుండి ఇళు కట్టిస్తున్నావ్.. పేదల ఇళ్లను మా త్రం కూలగొడుతున్నావ్. ఇదెక్కడి న్యాయం? రేవంత్‌రెడ్డి.. నీ ప్రభుత్వ జీవితకాలం ఐదేళ్లు మాత్రమే. కానీ నువ్వు కూలగొట్టే పేదల ఇళ్లు వారి జీవితకా లం కల'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొడంగల్‌లోని సీఎం ఇల్లు రెడ్డికుంటలో ఉందని.. ఆ ఇంటిని రేవంత్ ముందుగా కూలగొట్టాలని డిమాండ్ చేశారు. సీఎం బయటకొచ్చి బాధితులకు భరోసా ఇవ్వాలని.. మూసీ సుందరీకరణను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు ఇబ్బందులు వస్తే తెలంగాణ భవన్‌కు రావాలని... అర్ధరాత్రి వచ్చినా బాధితులకు ఆశ్రయం ఇస్తామని.. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని సూచించారు.

### బడి పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడం ప్రాధాన్యత కాదా?

ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో పేద పిల్లలకు అన్నం పెట్టేందుకు డబ్బుల్లేవంటున్న ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ కోసం రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తానంటే ప్రజలు నమ్మరని హరీశ్‌రావు పేర్కొన్నారు. పేద పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతా లేక రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేసి మూసీ సుందరీకరణ చేపట్టడం ప్రాధాన్యతో సీఎం చెప్పా లన్నారు. కొన్ని పాఠశాలల్లో ఆడ పిల్లలకు టాయిలెట్స్ లేక వందల మంది లైన్లలో నిలబడుతున్నా రని.. వారి కోసం టాయిలెట్స్ కట్టడం ప్రభుత్వ ప్రాధాన్యత కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గాంధీ ఆస్పత్రికి మందుల సరఫరా నిలిచిపోయిందని.. దీంతో రోగులకు మందులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఫార్మాసిటీ కోసం గత కేసీఆర్ ప్రభుత్వం 15 వేల ఎకరాల భూసేకరణ చేస్తే దాన్ని పక్కనపెట్టి రియల్ ఎస్టేట్ బ్రోకర్ సాయంతో ఫోర్త్‌సిటీ నిర్మిస్తానని సీఎం అంటున్నారని విమర్శించారు.

# రూ.5వేలు ఇచ్చి మాట్లాడిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

తయారు చేశామని, పనులు పారదర్శకంగా చేపడతామని, అంతర్జా తీయ గుర్తింపు ఉన్న సంస్థలకే పనుల బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. మూసీ, హైడ్రా విషయంలో అనుమానాల నివృత్తికి అన్ని కలెక్టరేట్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

# ఆర్టీసీకి రూ.1,263 కోట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

ఉచిత ప్రయాణానికి జారీ చేస్తున్న జీరో టికెట్ల ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ఆర్టీసీకి చెల్లిస్తూ వస్తోంది. గడిచిన ఐదు నెలల వ్యవధిలో ప్రభుత్వం రూ.1,263.62 కోట్ల నిధులను రోడ్డు రవాణా సంస్థకు విడుదల చేసింది.. ఆగస్టు 31 నాటికి 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రయాణాల ఛార్జి రూ.2,840.71 కోట్లు. కాగా, బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో డిసెంబరు నుంచి మార్చి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి నిధులు విడుదల చేయలేదు. 2024 ఏప్రిల్ నుంచి నిధుల విడుదల ప్రారంభమైంది. జూన్ నుంచి ప్రతి నెలా రూ.320 కోట్లకు పైగా చెల్లిస్తోంది.

# 116 కి.మీ. 80 స్టేషన్లు.. నిర్మాణ వ్యయం రూ.32,237 కోట్లు

మొదటి పేజీ తరువాయి

నివేదికను (కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కూడా పరిగణనలోకి తీసుకోనున్నాం. రెండోదశ మెట్రో మార్గాలలో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్‌చెక్ చేయనున్నాం. రెండో దశ డీపీఆర్‌లకు కేంద్రం నుంచి ఆమోదం పొందేందుకు ఇది తప్పనిసరి. ఎయిర్‌పోర్ట్ రూట్‌కు సంబంధించి అలైన్‌మెంట్‌లో కొంత మార్పు చేశాం. గతంలో మైలార్‌దేవ్‌పల్లి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించగా, ప్రస్తుతం దాన్ని ఆరాంఘర్ నుంచి 44వ నంబర్ జాతీయ రహదారి (బెంగళూరు హైవే)లోని కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా డీపీఆర్‌ను ఖరారు చేస్తున్నాం..'అని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇతర ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.



### భూగర్భంలో మెట్రో రైల్

నాగోల్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 36 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న నాలుగో కారిడార్ ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, కొత్త హైకోర్టు మీదుగా శంషాబాద్ జంక్షన్ నుంచి సాగుతుంది. రాయదుర్గం నుంచి నాగోల్ వరకు, మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ వరకు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న కారిడార్లు.. ఎయిర్‌పోర్టు మార్గంలో నాగోల్, ఎల్‌బీనగర్, చాంద్రాయణగుట్ట స్టేషన్ల వద్ద అనుసంధానమవుతాయి. మొత్తం 36.6 కిలోమీటర్ల ఎయిర్‌పోర్ట్ మెట్రో రూట్‌లో 35 కిలోమీటర్లు ఎలివేట్ చేయనున్నారు. 1.6 కిలోమీటర్ల వరకు మెట్రోలైన్ భూగర్భంలో నిర్మిస్తారు. ఎయిర్‌పోర్ట్ స్టేషన్ కూడా భూగర్భంలోనే ఉంటుంది. ఈ రూట్‌లో 24 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

- ఐదవ కారిడార్‌లో ఇప్పుడు ఉన్న రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియోపొలిస్ వరకు కొత్తగా లైన్ నిర్మించనున్నారు. ఇది బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్‌గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ వరకు ఉంటుంది. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్. ఈ 11.6 కిలోమీటర్ల మార్గంలో 8 స్టేషన్లు నిర్మించే అవకాశం ఉంది.
- ఆరో కారిడార్‌లో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న రూట్‌ను గతంలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు విస్తరించాలని ప్రతిపాదించారు. తాజాగా ఈ మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇది ఎంజీబీఎస్ నుంచి ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్‌లు ఈ కారిడార్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, అక్కడ నిర్మించే స్టేషన్లకు ఆ పేర్లే పెట్టనున్నారు.

### రోడ్ల విస్తరణ

- ప్రస్తుతం దారుల్‌షా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య ఉన్న 60 అడుగుల రోడ్డు, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న 80 అడుగుల రోడ్లను 100 అడుగులకు విస్తరించనున్నారు. స్టేషన్లు ఉండే ప్రాంతాల్లో మాత్రం 120 అడుగులకు విస్తరిస్తారు. పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్, రోడ్డు విస్తరణ నేపథ్యంలో సుమారు 1,100 నిర్మాణాలను తొలగించే అవకాశంఉంది. ఆరో కారిడార్‌లో 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటన్నింటికీ తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలతో, మెట్రో పిల్లర్ స్థానాలను సర్దుబాటు చేయనున్నారు. ఈ రూట్‌లో మొత్తం 6 స్టేషన్లు ఉంటాయి.
- ఏడవ కారిడార్‌లో మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల మేర లైన్ నిర్మించనున్నారు. మియాపూర్ నుంచి ఆల్విన్ క్రాస్‌రోడ్స్, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్, ఇక్రిసాట్ మీదుగా ఇది వెళుతుంది. ఈ రూట్‌లో సుమారు 10 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్.
- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించనున్న 8వ కారిడార్ 7.1 కిలోమీటర్‌ల వరకు ఉంటుంది. చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీల మీదుగా హయత్‌నగర్ వరకు నిర్మిస్తారు. సుమారు 6 స్టేషన్లు ఉంటాయి. ఇది కూడా పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్. 9వ కారిడార్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫోర్త్‌సిటీలోని స్కిల్స్ యూనివర్సిటీ వరకు ఉంటుంది.
- రెండోదశ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ..32,237 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. ఇందులో 40 కిలోమీటర్ల ఫోర్త్‌సిటీ మెట్రోకే రూ.8 వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రో రెండో దశ చేపట్టనున్నారు.

# హైడ్రాపై సీఎం రేవంత్‌కు లేఖ రాస్తా: దానం నాగేందర్

**హైదరాబాద్:** తెలంగాణలో హైడ్రా అంటే ప్రజల్లో టెన్షన్ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా కొంచెం ముందుగా మేల్కొంటే ప్రజల్లో అభద్రతాభావం వచ్చేది కాదు అంటూ కామెంట్స్ చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కారణంగానే అక్రమ కట్టడాలను పర్మిషన్ ఇచ్చినట్టు చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ..'హైడ్రా కూల్చివేతలపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతాను. హైడ్రా కాస్త ముందే మేల్కొంటే ప్రజల్లో అభద్రతాభావం వచ్చేది కాదు. మూసీలో ఆక్రమణలు ఉన్నాయని మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ చెప్పలేదా?. అక్రమ కట్టడాలను కూల్చేస్తామని కేసీఆర్ ప్రకటించింది మర్చిపోయారా. అక్రమ కట్టడాలకు బీఆర్ఎస్ హయాంలోనే విచ్చలవిడిగా పర్మిషన్ ఇచ్చారు. కూల్చివేతలపై కాంగ్రెస్ పార్టీ కూడా మరింత లోతుగా ప్రజలకు అవగాహన కల్పించాలి. కూలగొట్టే ముందు అక్కడి వాస్తవ పరిస్థితులు హైడ్రా ప్రజలకు తెలియజేస్తే ఇంత ఇబ్బంది అయ్యేది కాదు. చిన్న చిన్న ఘటనలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాయి. ఒక చిన్నారి తన పుస్తకాలు ఇంట్లో ఉన్నాయని బోరున ఏడ్చింది.. నాకు చాలా బాధగా అనిపించింది. పేదల విషయంలో హైడ్రా మరోసారి ఆలోచించాలి. గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు పది ఎమ్మెల్యేలు సిద్ధంగా



ఉన్నారు. మా కేసు బూచీగా చూపెట్టి బీఆర్ఎస్ పెద్దలు ఆపుతున్నారు. కాస్త ఆలస్యం అయినా మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక పక్కా. సీఎం రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు తిట్టిస్తున్నారు. గౌరవప్రదంగా ఉండే హరీష్ రావు కూడా గాడి తప్పారు. బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. ఇదే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళాను'అని కామెంట్స్ చేశారు. ఇదిలా ఉండగా..'మూసీ, హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా హైదర్‌షా కోట్‌లో మూసీ బాధితుల ఇండ్లను పరిశీలిస్తున్నారు. బాధితులకు అండగా ఉంటామని భరోసానిస్తున్నారు. పార్టీ తరఫున న్యాయపరంగా పోరాటం చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మూసీ బాధితులు చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపారు.

# మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

**హైదరాబాద్‌బీ శేరిలింగంపల్లి, రాయదుర్గం:** రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి (90) ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. హైదరాబాద్ కొండాపూర్ మసీదుబండలోని తన కుమార్తె ఇంట్లో ఉంటున్న ఆయన వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. పురుషోత్తంరెడ్డికి భార్య ఉషాదేవి, కుమారులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, కుమార్తె హితశ్రీరెడ్డి ఉన్నారు. పురుషోత్తంరెడ్డి స్వగ్రామం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల. బీహెచ్‌ఈఎల్‌లో జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన ఆయన.. సిమెంట్, సోలార్ రంగాల్లో నిష్ణాతులుగా పేరొందారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు పురుషోత్తంరెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,



ఆయన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మహాప్రస్థానంలో పురుషోత్తంరెడ్డి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఉత్తమ్‌కు దూరపు బంధువైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పాడె మోశారు.

# ఆర్టీసీలో 3 వేల పోస్టులు భర్తీ చేస్తాం: మంత్రి పొన్నం

**కరీంనగర్:** టీజీఎస్‌ఆర్టీసీలో త్వరలో 3 వేలకుపైగా పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పీఆర్సీ, కారుణ్య నియామకాలపై కూడా దృష్టి సారిస్తామని వివరించారు. ఆదివారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సంస్థ ఎండీ సజ్జనార్‌తో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఆర్టీసీలో సిబ్బంది 65 వేల నుంచి 43 వేలకు, బస్సులు 15 వేల నుంచి 9 వేలకు తగ్గినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో రింగ్‌రోడ్ లోపల ఒక్క డీజిల్ బస్సు కూడా తిరగకూడదన్నది సీఎం రేవంత్ సంకల్పమని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. "మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 92 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి రూ.3,216 కోట్లు ఆదా చేసుకున్నారు. పర్యావరణ హితంలో భాగంగా మరో 2,500 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు కసరత్తు చేస్తున్నాం. మహిళలకు పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా వాటి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటున్నాం. నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కుతాయి. హైబ్రిడ్ వాహనాలు తయారుచేస్తున్న మారుతి సంస్థతో బస్సుల కొనుగోలుకు చర్చలు జరుపుతున్నాం.

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమా?: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

పరిస్థితి కూడా దెబ్బతింది. ఇప్పటికైనా హైడ్రాపై ప్రభుత్వం సమీక్ష చేయాలి' అంటూ కామెంట్స్ చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హామీలు అమలు చేయలేక పిల్లి గంతులు వేస్తున్నారు. బ్యాంకులు 73 లక్షల మందికి రుణాలు ఇచ్చామని చెబుతున్నారు.. 48 లక్షల మందికి అని రేవంత్ రెడ్డి చెప్పారు. 35 నుంచి 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. మేడ్చల్‌లో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు బీజేపీ దీక్ష చేపట్టింది. అప్పులపాలై రుణమాఫీ కానీ రైతులందరూ రైతు దీక్షకు హాజరై విజయవంతం చేయాలి. రైతు బంధు, రైతు బీమా, రైతు బోనస్ వస్తాయనే నమ్మకం లేకుండా పోయింది. రేవంత్ వాలకం చూస్తుంటే ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. రేవంత్ రెడ్డి మెడలు వంచడానికి కలిసికట్టుగా పోరాటం చేద్దాం బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి.. రేపు ధర్నా చౌక్‌లో రైతు దీక్ష చేపడుతున్నాం. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్నాం. రైతు హామీల సాధన దీక్షను విజయవంతం చేయడానికి ప్రతీ రైతు కదలిరావాలని పిలుపునిచ్చారు. ?

# 'మూసీ'కి లక్షల జీవితాలు బలి

మొదటి పేజీ తరువాయి



ధ్వజమెత్తారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డిని నిందిస్తూ ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆదివారం సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'గుండెలు పగిలి గూళ్లు చెదిరి ఆడబిడ్డల ఆవేద నతో, ఇంటి పెద్దల శాపనార్థాలతో నగరం రోది స్తోంది. రెక్కలు ముక్కలు చేసి కలల కుటీరా లను నిర్మించి కన్నబిడ్డలకు ఇవ్వలేకపోతున్నా ని ఓ తల్లి... అమ్మ లాంటి ఇల్లు వదిలి వేరే దిక్కు కు ఎలా పోతామని మరో తండ్రి గుం డెలు బాదు కుంటున్నారు. ఆడబిడ్డకు కట్నంగా ఇచ్చే ఇల్లు కూలుస్తారేమోనని ఓ తల్లిఆత్మహత్య చేసుకుంది. భార్య కడుపు తో ఉందన్నా కనికరించరా? అని ఓ భర్త ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. నాడు రైతుల ప్రయోజనం కోసం 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే రిజర్వాయర్ నిర్మాణం విషయంలో 20 కార్లతో రైతులను రెచ్చగొడుతూ శవాలపై పేలాలు ఏరుకున్న సన్నాసి ఇప్పుడు ఎక్కడ పన్నావ్? నాడు అలా-నేడు ఇలా.. నీ అవసరానికి ఎంత నీచానికైనా తెగిస్తావని మరోమారు నిరూపించావ్'అని సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమె త్తారు. ప్రజలు అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని.. కోర్టులు, బీఆర్ఎస్ అండగా ఉంటాయని ధైర్యం చెప్పారు.

### బావమరిదితో నోటీసు ఇప్పిస్తే..

అమృత్ టెండర్ల అంశంలో తాను చేసిన ఆరో పణలపై సీఎం రేవంత్ బావమరిది సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపడాన్ని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'బావ మరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడుదు బంద్ చేస్తానని అనుకుంటున్నావా? బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూ స్తూ ఊరుకోము'అని వ్యాఖ్యానించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖలోనే ఆయన బావమరిది శోధ కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్టబెట్టింది నిజమన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 11, 13ని సీఎం ఉల్లంఘించారని ఆరోపించారు. శోధ గత రెండే ళ్లుగా కేవలం రూ. 2 కోట్ల లాభాన్నే ఆర్జించిన ఓ చిన్న కంపెనీ అన్నారు. 'ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడటం కష్టమే. నీకు ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్‌గా దొరి కావు.. రాజీనామా తప్పదు' అని పోస్ట్ చేశారు.

## నేడు బిజెపి ఆధ్వర్యంలో జరిగే రైతు దీక్షకు పెద్ద ఎత్తున రైతులు ప్రజలు హాజరు కావాలి

### కిసానమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– బిజెపి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద రేపు జరుగుతున్న రైతుల దీక్షకు రైతు నాయకులు రైతులు, రుణమాఫీ కానీ రైతు బంధువులందరు హాజరు కావాలని కోరుకుతున్నట్లు కిసానమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఉప్పల్లో కిసానమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, మహేశ్వర్ రెడ్డి శాసనసభ పక్ష నాయకులు 24 గంటల యొక్క దీక్ష కార్యక్రమము ఉంటుందని, రేపు సోమవారం నాడు ఉదయం 11 గంటలకు మొదలై మంగళవారం నాడు ఉదయం 11 గంటల వరకు దీక్షా కార్యక్రమం ఉంటుంది, కాబట్టి ప్రజలు బాధితులు రుణమాఫీ కానీ రైతులు,రేషన్ కార్డు లేని రైతులు, అందరూ పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## ప్రతి ఉద్యోగి విధినిర్వహణలో పదవీ విరమణ తప్పదు

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో జాగ్రత్తగా పని చేయాలని ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం శివ సాయి గార్డెన్ నాగారం లో జరిగిన పోలీస్ రంగారెడ్డి (గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు) పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కుషాయిగూడ హెడ్ మాస్టర్ గా సేవలు అందించిన రంగారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు.ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేశాడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ఎం ఈ ఓ, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## హైడ్రాతో హైరానా!

**మీకు అండగా ఉంటా : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

**హైడ్రా బుల్డోజర్లు మీ దాక రావాలంటే ముందు నన్ను దాటుకొని రావాలి**

**కాలనీవాసులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భరోసా**

ఎల్బీనగర్, వాయిస్ టుడే: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి కాలనీలో ఇటీవల అధికారులు మార్కింగ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదివారం ఫణిగిరి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతూ హైడ్రా బుల్డోజర్లు మీ దాకా రావాలంటే..ముందు నన్ను దాటుకొని రావాలని పేర్కొన్నారు. మీకు అండగా ఉంటానని కాలనీవాసులకు భరోసానిచ్చారు. పేద ప్రజలు పైసా పైసా కూడబెట్టుకుని కట్టుకున్న ఇళ్లను కూలుస్తామని హైడ్రా అధికారులు మార్కింగ్ చేయడం సరైనది కాదన్నారు. హైడ్రా పేరుతో పేద ప్రజలను ఇబ్బంది పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, లింగాల రాహుల్ గౌడ్, తోట మహేష్ యాదవ్, సొంటి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులున్నారు.

## చైర్మన్ వైస్ చైర్మన్లను అభినందించిన మంత్రి సీతక్క

అబ్దుల్లాపూర్ మెట్టు: సెప్టెంబర్29 (వాయిస్ టుడే) గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లను రాష్ట్రమంత్రి సీతక్క అభినందించారు. తెలంగాణ రాష్ట్రం లోనే అతి పెద్ద మార్కెట్ అయిన గడ్డి అన్నారం వ్యవసాయ (పండ్లు)మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర చారిని, నియమించడానికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణ నీటిసరపరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ(సీతక్క)కు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్ లను డైరెక్టర్లను అభినందించి, వ్యవసాయం మార్కెట్ అభివృద్ధి కోసం సాయసహకారం అందచేస్తామని సీతక్క తెలియచేయడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, మేడ్చల్ నియోజికవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజికవర్గం కాంగ్రేస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిని ఆదివారం వారి నివాసాలలో కలిసి తమకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపిన గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరక్టర్లు రఘుపతి రెడ్డి, నవరాజ్, అంజయ్య, మచ్చేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, జైపాల్ రెడ్డి, మేకం లక్ష్మి, నరసింహ, ఇబ్రహీం పాల్గొన్నారు.

## మీలాద్ -ఉన్ -నభీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

### జామా మజ్జిద్‌ను ప్రారంభించారు




అబ్దుల్లాపూర్ మెట్టు: సెప్టెంబర్29 (వాయిస్ టుడే) మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ మైనారిటీ సోదరులు ఏర్పాటు చేసిన మీలాద్ -ఉన్ -నభీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. అనంతరం జామా మజ్జిద్ ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పథకాలను అందజేస్తుందని, మునుమందు అనేక ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలు మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## రైతుల సమస్యల పరిష్కారాన్ని కృషి

### చిలుక మధుసూదన్ రెడ్డి

అబ్దుల్లాపూర్ మెట్టు: గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్ రెడ్డి నియమితులైన సందర్భంగా నూతన పాలకవర్గంతో కలిసి మంత్రి దనసరి సీతక్క, టీ పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తదితరులను ఆదివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించేందుకు మార్కెట్ కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్.భాస్కరాచారి, డైరెక్టర్లు రఘుపతిరెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకటేష్ గుప్త, మేకం లక్ష్మి, నరసింహ, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిపై అనుచితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

### ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ




ఇబ్రహీంపట్నం: సెప్టెంబర్29 (వాయిస్ టుడే) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచితంగా వ్యవహరిస్తున్న అటువంటి యూట్యూబ్ ఛానల్ ల మీద కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆకుల ఆనంద్ కుమార్, యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ మడుపు సాయితేజ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి దొంతరమోని రాజు, ఎన్ఎస్ యుఐ నాయకులు కార్తీక్ పటేల్ పాల్గొన్నారు.

## బస్టాండులోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

### అధికారులను ఆదేశించిన స్థానిక ఎమ్మెల్యే



యాచారం: సెప్టెంబర్29 (వాయిస్ టుడే) మాల్ బస్టాండ్ లోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేని కోరిన మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు. యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి మాల్ (రంగారెడ్డిజిల్లా) గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అయితే అటుగా వెళ్లే బస్సులు దేవరకొండ, నల్గొండ, ఇబ్రహీంపట్నం, మిర్యాలగూడ డిపోలకు చెందిన బస్సులు, బస్టాండ్ లోపలికి రాకుండా రోడ్డుపై నుండే వెళ్లడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రయాణికులు గంటలకొద్దీ ఎండలో రోడ్డుపై నిలబడడం జరుగుతుందని, బస్టాండ్ లోకి బస్సులు వస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. రాబోయే పది రోజుల్లో దసరా పండుగ ఉన్న సందర్భంగా బస్టాండ్ లోకి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరడం జరిగిందని తెలిపారు. మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ కు, యాచారం మండలం ఎంపీడీవోకు ఫోన్ ద్వారా మాట్లాడుతూ బస్టాండ్ వద్దకు చేరుకొని అక్కడ పరిస్థితులను పరిశీలించి బస్సులు లోపలికి వచ్చే విధంగా చూడాలని, అలాగే ప్రయాణికులకు తగిన ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మస్కు నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లిక్కి జంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మిపతి గౌడ్, బాసని బుచ్చిరెడ్డి, చిన్నోల మల్లేష్, గిరమోని రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాల్ గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.



## ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన

### ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: సెప్టెంబర్29 (వాయిస్ టుడే) రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాదా ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి మరణించిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి. అనంతరం వారి పార్థివ దేహనికి పూల మాలవేసి నివాళు లు అర్పించి వారి ఆత్మ శాంతి చేకూరాలని కోరారు.





గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి,పాలకవర్గ సభ్యులను ఆదివారం ఉదయం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మంద ముల్ల పరమేశ్వర్ రెడ్డి,అతని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపి, మార్కెట్ అభివృద్ధికి దోహదపడాలని కోరడం జరిగిందన్నారు.

- ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)

## ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 బ్రోచర్ ఆవిష్కరణ

### అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ) : 2024 జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీన హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం,యూసఫ్ గూడా వద్ద 19వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా శనివారం కాచిగూడలోని అకాడమీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ సీనియర్ అడ్వకేట్ అశోక్ ఆనంద్ కుమార్ హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్న గౌడ్, డాబర్ ఫ్రూట్ జ్యూస్ స్పాన్సర్ లయన్స్ క్లబ్ డిస్టిక్ వైస్ గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వర్ పాల్గొని ఈ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరాటే వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన కళ అని, దీని ద్వారా ఆత్మరక్షణతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.ఈ కరాటే పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ వివరాల కోసం సెల్: 9494112424 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ రావు,కరీం,సుభాష్, శ్యాంకుమార్ హంస,అమృత రెడ్డి,ఘన సంతోషిణిరెడ్డి,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మాదాపూర్ డివిజన్‌లోని అయ్యప్ప సొసైటీ ఆఫీస్ బిల్డింగ్‌ను ప్రారంభించిన పిఏసి చైర్మన్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 29(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ లో అయ్యప్ప సొసైటీ ఆఫీస్ బిల్డింగ్ ను పిఏసి చైర్మన్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ ఆఫీస్ భవనం ను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ఈ రోజు అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమైన విషయం అని ,ఆఫీస్ బిల్డింగ్ ను కాలనీ సంక్షేమం ,అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు. అదేవిధంగా ఆఫీస్ భవనంలో లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు , జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. మాదాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయ షెక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అయ్యప్ప సొసైటీ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ కేవీ రావు, వైస్ ప్రెసిడెంట్ డివి రత్నం, ట్రెజరర్ ఎంవివికే ప్రసాద్, ట్రెజరర్ ఎస్ కే వి తిరుపతి రాజు, కమిటీ మెంబర్లు భవాని, పద్మజ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నూతన రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించిన కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్

శేరిలింగంపల్లి :సెప్టెంబర్ 29(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్ లో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను రూ 12.5 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన స్థానిక నాయకులతో కలసి కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పర్యవేక్షించారు.చేపట్టిన పనులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకోని రావాలని కాంట్రాక్టర్ కు సంబంధిత అధికారులకు కార్పొరేటర్ హమీద్ పటేల్ సూచించారు.



# కుల గణనతోనే దేశంలో ప్రగతి




బేగంపేట,(వాయిస్ టుడే ప్రతినిధి):- దేశంలోని అన్ని సామాజిక వర్గాలు, వారి వాస్తవ స్థితిగతుల లెక్కలను శాస్త్రీయంగా చేపట్టి ఆ దిశగా చర్యలు చేపట్టినప్పుడే అంతరాలు లేని సమాజ నిర్మాణం జరుగుతుందని సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ జాతీయ కన్వీనర్ డాక్టర్ అనిల్ జైహింద్ అన్నారు. దేశంలో కుల గణన చేపట్టే అంతవరకు మా ఉద్యమం క్రమక్రమంగా మరో స్వాతంత్ర్య సమరంగా కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగిన కుల గణన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ బిసి ఉద్యోగుల ఫెడరేషన్ నిర్వహించింది. కార్యక్రమానికి ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు దేవల సమ్మయ్య సమాధ్యక్షత వహించారు. ప్రధాన వక్తలుగా ప్రధాన వక్తలుగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, జస్టిస్ బి చంద్రకుమార్ ,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ,ప్రొఫెసర్ కె మురళీ మనోహర్, ఐ తిరుమలి ,పి ఎల్ విశ్వేశ్వరరావు, ఎస్ సింహాద్రి, డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, దుర్గం రవీందర్, సోగరా బేగం, డాక్టర్ వేణు యాదవ్, వరంగల్ శ్రీనివాస్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు.. ఈ సందర్భంగా సమావేశంలో జస్టిస్ బి చంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో అన్ని వర్గాలకు సమానమైన హక్కులు కల్పించాలని స్పష్టంగా ఉందన్నారు. అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కారణంగా దేశంలో వివక్షత, అణిచివేత, పేదరికం పెరుగుతుందన్నారు.

ఇందుకు శాస్త్రీయంగా కుల గణన నిర్వహించి, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టినప్పుడు ఈ దేశం త్వరితగతిన పురోగతి చెందుతుందన్నారు. డాక్టర్ వకుళాభరణం ప్రసంగిస్తూ...

బలహీన వర్గాలకు మాత్రమే 50% లోపు రిజర్వేషన్లు అనే నిబంధనను అమలు చేయడం అన్యాయం అన్నారు.

వెనుకబాటు తనమ్ ప్రాతిపదికన ప్రయోజనాలు కల్పించాలని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ పేద వర్గాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు.

15(6)16(6) ఆర్టికల్స్ ద్వారా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ల కల్పన అశాస్త్రీయంగా ఉంది అన్నారు. పరిమాణాత్మక సమాచారం లేకుండా రిజర్వేషన్లు కల్పించడం ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. దేశంలోని బలహీన వర్గాల జీవనస్థితి గతులను సమగ్రంగా తెలుసుకోవడానికి కుల గణనను చేపట్టాలని దశాబ్దాలుగా ఆ వర్గాల నుండి డిమాండ్ వస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన విమర్శించారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రసంగిస్తూ... రాష్ట్రంలో ఏ ఒక్క బీసీకి అన్యాయం జరిగిన అండగా నిలబడతానని ప్రకటించారు.

ఈ రాష్ట్రానికి ఓసీల నుండి రేవంత్ రెడ్డి చివరి ముఖ్యమంత్రి అని అన్నారు వచ్చే ఎన్నికల అనంతరం ఈ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించారు.

రాష్ట్రంలో తాను ఇప్పటికే కులగణన కార్యక్రమమును చేపట్టానని ఏ నియోజకవర్గంలో అగ్రవర్ణాల సంఖ్య ఎంతో లెక్కలు తీస్తున్నాను అని అన్నారు. వారి లెక్కలు తెలిసిన తర్వాత అంత బీసీలే అని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ అగ్రవర్ణాలలోని పేదలు కలిసి రాష్ట్రంలో బహుజన రాజ్య స్థాపన తన జీవిత లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 15(4) 15(5),16(4) ప్రకారం బీసీ కులాలను సామాజికంగా విద్య పరంగా వెనుకబడిన తరగతులకు గుర్తించారు కానీ వీరికి సరైన న్యాయం జరుగుతుందా అని అన్నారు. దేశంలోని 90 శాతం సంపదకు యజమానులు ఉన్న ఆధిపత్య కులాలకు ఈ డబ్ల్యూ ఎస్ పేరిట 10% రిజర్వేషన్లు ఇచ్చిన బిజెపి ప్రభుత్వం, బీసీల పట్ల మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం సమన్వయకర్తలుగా సతీష్ కొట్టే, టి తుల్జా రామ్ సింగ్, వినోద్ కురువ, డాక్టర్ పి విజయ్ కుమార్, గిల్లా భద్రయ్య, వంశీకృష్ణ గోపాల్ లు వ్యవహరించారు. సమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు సభ ఏకగ్రీవంగా కోరింది.

కుల సర్వే అనంతరమే 42 శాతం రిజర్వేషన్ల తో స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహించాలని సభ డిమాండ్ చేసింది. త్వరలోనే కుల సర్వే చేపట్టాలని సమావేశాలు నిర్వహిస్తామని ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు దేవుళ్ళ సమ్మయ్య తెలిపారు.



## మానవ జీవన శైలిలోని ప్రతి ఒక్కరు ఆహార అలవాట్లను అలవర్చుకోవాలి

### నేడు ప్రపంచ హృదయ దినోత్సవం...

### కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 29(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్ రోడ్డు లోని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ హార్ట్ డే (ప్రపంచ హృదయ దినోత్సవం) కార్యక్రమంలో హోలిస్టిక్ హాస్పిటల్ ఛైర్మెన్ శ్రీ రామచంద్ర రావు తో కలిసి హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. గుండెపోట్లకు దూరంగా ఉండాలంటే యువత నిత్యం వాకింగ్ చేయాలన్నారు. ఆహారపదార్థాల్లో రసాయనాలు మిశ్రమం అవుతున్నాయని, దీంతో గుండె జబ్బులు హెచ్చు మీరుతున్నాయని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి వ్యాయామం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందని ఈ సందర్బంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల సీనియర్ సిటిజన్లు, యువకులు, హోలిస్టిక్ హాస్పిటల్ డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమలానగర్ స్థానికులకు డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వండి



జూబ్లీహిల్స్ 29 సెప్టెంబర్ (వాయిస్ టుడే): రహమత్ నగర్ డివిజన్ కమలానగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హైదర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు..సమావేశంలో వారు మాట్లాడుతూ కమలానగర్లోని గత 40 సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రజలకి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని వినతి పత్రం సీఎం రేవంత్ రెడ్డి మరియు తెలంగాణ రెవెన్యూ గృహ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి మరియు జూబ్లీహిల్స్ ఇంచార్జ్ మంత్రి ఫోన్ నెంబర్ ప్రభాకర్ రావు తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు కలెక్టర్ జిల్లా అనుదీప్ శెట్టి మరియు సికింద్రాబాద్ ఆర్డిఓ అందరికీ మా యొక్క లెటర్ ప్యాడ్ పై వినతిపత్రం ఇవ్వడం జరిగింది మరియు హైకోర్టు లో కూడా డబల్ బెడ్ రూమ్ కొరకు కేసు వేయడం జరిగిందన్నారు ..56 మందికి డబుల్ బెడ్ రూమ్లో ఇవ్వాలని మీడియా ద్వారా తెలియజేశారు.



తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల,సివిల్ సప్లై శాఖ,మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రీ పురుషోత్తం రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పురుషోత్తం రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పులామాల వేసి నివాళులర్పించారు.

- భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి)

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం

### టీయుడబ్ల్యూజే(ఐ జెయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు

### కూకట్‌పల్లిలో దరఖాస్తుల స్వీకరణ



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 29(వాయిస్ టుడే) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని జర్నలిస్టుల సంక్షేమమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐ జెయు) పని చేస్తుందని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు తెలిపారు. కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏఎస్ రాజు కమ్యూనిటీ హాల్లో జరిగిన వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జర్నలిస్టుల విలువలు నానాటికి పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు స్వీయ నియంత్రణతో విధి నిర్వహణలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో జర్నలిజానికి మరింత గడ్డుకాలం రానందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం చేపడుతున్నటు వంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారిగా లిస్టులను తయారు చేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘాల కతీతంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు కొసరు ఎవరు అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందని స్పష్టం చేశారు. అర్హులందరినీ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల నుంచి ఇండ్ల పట్టాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. కార్యక్రమంలో కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కరీం, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రంజిత్, జిల్లా నాయకులు నవీన్ రెడ్డి, తిరుపతి, గంగరాజు, నరసింహారావు, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వర్ రావు, మురళీ , నిమ్మల శ్రీనివాస్, హరిబాబు,సామెల రాము తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కరీంనగర్, సెప్టెంబర్ 29(వాయిస్ టుడే) మానకొండూర్ మండలం ఊటూర్ గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 1989.1990 పదోతర్గతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 34సంవత్సరాల తరువాత నాటి సుమృతులను గుర్తు చేసుకొని ఒకరిని ఒకరు ఆప్యాయంగా కలుసుకున్నారు వారు చదివిన పాఠశాలకు తమ వంతు సహాయం చేస్తామని విద్యార్థి, విద్యార్థులు చెప్పారు. అనంతరం అటపాటాల తో ఉచ్చహంగా కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం లో టీచర్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ, రాయమల్లు,భాస్కర్, శ్రీధర్, సుదర్శన్, రాజిరెడ్డి, వెంకట్రాజం విద్యార్థులు, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, సర్వేషం, గడ్డం శ్రీనివాస్, పూసాల సంపత్, చెంద్ర రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లేశం, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఎంజెఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శాస్త్ర చికిత్సలు



కరీంనగర్ సెప్టెంబర్ 29(వాయిస్ టుడే)లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి లయన్ చింతల కిషన్ పటేల్ ఎంజెఎఫ్ జోన్ చైర్ పర్సన్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఎంజెఎఫ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి లో నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరికీ ఉచిత కంటి శాస్త్ర చికిత్సలు చేయించారు. అనంతరం బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్ పటేల్ మాట్లాడుతూ..రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్ట్ మెంబర్ ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సహకారంతో నేటి రోజు వరకు 136 ఉచిత కంటి శాస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సీనియర్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి సెప్టెంబర్ 29 : బోయినపెల్లి మండల కేంద్రానికి చెందిన "దాసరి బాబు" గల్ఫ్ లో గుండెపోటుతో మరణించగా, వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా వారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఆయన వెంట మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్మేంధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం,పవన్, తిరుపతి తదితరులు ఉన్నారు.



## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత

తొర్రూరు, సెప్టెంబర్ 29 వాయిస్ టుడే : స్నేహితుని కుటుంబానికి ఆదివారం ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన

కొమ్ము రామచందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతోపాటు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదివిన స్నేహితులు మృతుని కుటుంబానికి అండగా నిలవాలని తలచారు. అనుకున్నదే తడవుగా స్నేహితులతో మాట్లాడి 20 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. సదరు మొత్తాన్ని భార్య రమ, కుమారులు శ్రీకాంత్, రాజుకు అందజేశారు. సహాయం చేసిన వారిలో దీకొండ శ్రీనివాస్, వెంకటరమణ, కృతి రెడ్డి, ఎద్దు కొమురెల్లి, సారయ్య, బాదం వెంకన్న, శ్రీనివాసచారి, సునీత, సంధ్యారాణి, కుమారస్వామి,వెంకటరెడ్డి,మేష్, ఐలయ్య, పద్మ, హేమలత.నవీన్.సంపత్,వెంకటేశ్వర్ల, రాజు, ఉమారాణి , కవిత, సోమనరసయ్య, రామ్మూర్తి, ప్రవీణ్,కొమ్ముఅరుణ, శ్రీలత,రమ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి 75 కేజీ ల బియ్యం అంద జేత



తొర్రూర్ సెప్టెంబర్ 29 వాయిస్ టూడే: తొర్రూర్ పట్టణ కేంద్రాని కి చెందిన పొన్నోజు శంకరయ్య ఇటీవల అనారోగ్యం తో మృతి చెందడం తో ఆదివారం పాలకుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,తొర్రూర్ సర్పంచ్ పెదగాని సోమయ్య బాధిత కుటుంబ సభ్యుల కు 75 కేజీ ల బియ్యాన్ని అంద జేశారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.,గత 30 సంవత్సరాలు గా పేదల కు అండ గా ఉంటూ వారి కి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలియ చేశారు.ప్రతి ఒక్కరు పేదలకు చేయూతను అందించా లన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జంజీరాల మనోహర్, లక్ష్మణ్, శోభన్, యశ్వంత్,బ్రహ్మచారి,రాజ్-కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల కోసం శరవేగంగా ముస్తాబవుతున్న శ్రీ మహాశక్తి దేవాలయంపై ప్రత్యేక కథనం

కరీంనగర్ సెప్టెంబర్ 29(వాయిస్ టుడే)దసరా నవరాత్రులకు సమయం దగ్గర పడుతుంది. మహిమాన్విత శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు కొలువుదీరిన దివ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయంతో పాటు పరిసరాల వీధులన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నయి.



శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వాముల ఆశీస్సులతో అక్టోబర్ 3 నుండి ప్రారంభమవుతున్న శ్రీ దేవీ నవరాత్రోత్సవాలు 12 తేదీ వరకు కన్నుల పండుగగా, ఘనంగా, అత్యంత పవిత్రతతో నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు శ్రీ మహాశక్తి దేవాలయం కనువిందు చేసేలా దేవాలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పూల అలంకరణలతో, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయిస్తున్నారు. అలాగే ఆలయానికి వచ్చే రహదారులను ఆకర్షణీయమైన విద్యుద్దీపాల వెలుగులతో విరజిమ్మేళ ఏర్పాట్లు చేస్తున్నారు.

కోరిన కోరికలు తీర్చే శ్రీ మహాశక్తి అమ్మవార్లు నిజంగా చల్లని తల్లులు. ముల్లోకాలకు మూలమైన శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు కొలువుదీరిన దివ్య క్షేత్రం. ఆ తల్లులను ప్రార్థిస్తే జ్ఞానం, ఐశ్వర్యం, సంతానం, కీర్తి ప్రతిష్టలు, ఇలా ఒకటేమిటి కోరిన కోరికలు తీర్చే కల్పవల్లులు. నవరాత్రి సమయంలో అమ్మవారిని దర్శిస్తే సర్వ శుభాలను, ఐహిక సుఖాలతో పాటు మోక్షాన్ని పొందవచ్చని శాస్త్ర వచనం. ఈ నవరాత్రి రోజులలో శ్రీ మహాశక్తి దేవాలయం ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగుతుంది. ముఖ్యంగా ప్రతి ఏటా అమ్మవారి భక్తులు స్వీకరించే "భవాని దీక్ష" లు ఇప్పటికే ప్రారంభం కాగా వేలాది మంది భక్తులు తమ శక్తి కొలది 108 రోజులు, 41 రోజులు, 21 రోజులు, 11 లేదా నవరాత్రి దీక్షను ప్రతి ఏటా స్వీకరిస్తు నియమనిష్ఠలతో అమ్మవారిని సేవిస్తూ, తరిస్తున్నారు. నవరాత్రోత్సవాలలో భవాని దీక్ష చేపట్టి అమ్మవారిని భక్తితో కొలిస్తే ఎలాంటి బాధనుంచైనా ఉపశమనం లభిస్తుందని సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం భక్తులలో ఉంది. అందుకే దేవాలయ ప్రారంభం నుండి మొదలుకొని నేటి వరకు ఇక్కడ భవాని దీక్ష చేపట్టే భక్తులు గణనీయంగా పెరిగిపోయారు. స్త్రీ, పురుష బేధములు లేకుండా అందరూ ఆచరించే విశిష్ట భవానీ దీక్ష కోసం కరీంనగర్ జిల్లాతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా, ఇతర రాష్ట్రాల నుండి శ్రీ మహాశక్తి దేవాలయానికి ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవారి మాలాధారణ కోసం, ఉత్సవాల కోసం తరలివచ్చె అశేష భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు ఏ రోజు ఏ అవతారంలో, ఏ అలంకరణలో దర్శనమివ్వనున్నారంటే

3వ తేదీ, గురువారం శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి (శైలపుత్రి) అవతారం ఉదయం 8 గం.లకు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి పూజ, స్వస్తి పుణ్యహావాచనం, గణపతి పూజ, మాతృకపూజ, నాంది, ఆంకురారోపణము, అఖండ దీపారాధనము, సర్వతోబద్రమండలం, చతుష్షష్టి ఉపచారపూజ, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం. సాయంత్రం 6 గం.లకు శ్రీ మహాదుర్గా అమ్మవారికి ఫలపంచామృత అభిషేకం మరియు వివిధ రకాల పుష్పములతో అమ్మవారికి పుష్పాభిషేకం. 4 తేదీ, శుక్రవారం శ్రీ గాయత్రీ దేవి (బ్రహ్మచారిని) అవతారం ఉదయం 8 గం.లకు శ్రీ గాయత్రీ దేవి పూజ మరియు అమ్మవారికి డ్రై ఫ్రూట్స్ తో అలంకరణ. సాయంత్రం 6 గం.లకు సామూహిక కుంకుమ పూజలు. 5 తేదీ, శనివారం

శ్రీ అన్నపూర్ణ దేవి (చంద్ర ఘంట) అవతారం రోజున ఉదయం 8 గం.లకు శ్రీ అన్నపూర్ణాదేవి పూజ అమ్మవారికి శాకాంబరీ అలంకరణ. సాయంత్రం 6 గం.లకు 108 రకాల నైవేద్యాల సమర్పణ మరియు కొడకండ్ల రాధాకృష్ణ శర్మచే భగవన్నామ సంకీర్తనం. 6 తేదీ, ఆదివారం శ్రీ లలితా దేవి (కూష్మాండ ) అవతారం రోజున ఉదయం 8 గం.లకు శ్రీ లలితా దేవి పూజ మరియు గాజులతో అలంకరణ. సాయంత్రం 6 గం.లకు లలిత సహస్రనామం, సౌందర్య లహరి, కనకధార స్తోత్ర పారాయణం. 7 తేదీ, సోమవారం మహాచండీ దేవి (స్కంద మాత) అవతారం

రోజున ఉదయం 8 గంటలకు శ్రీ మహా చండీ దేవి పూజ మరియు పండ్లతో అలంకరణ. సాయంత్రం 6 గం.లకు లింగార్చన. 8తేదీ మంగళవారం శ్రీ మహాలక్ష్మి దేవి (కాత్యాయని) అవతారం

ఉదయం 10 గంటలకు శ్రీ మహాలక్ష్మి దేవి పూజ, అమ్మవారికి నాణాలతో, తామర పూలతో అలంకరణ

సాయంత్రం 6 గం.లకు విష్ణు సహస్రనామ పారాయణం.

9తేదీ బుధవారం మూల నక్షత్రం - శ్రీ సరస్వతి దేవి (కాళరాత్రి) అవతారం ఉ.8 గం.లకు శ్రీ సరస్వతి దేవి పూజ మరియు అమ్మవారికి పూలతో అలంకరణ. సాయంత్రం 6 గం.లకు విద్యార్థులచే సరస్వతీ పూజ, పల్లకి సేవ, రతన్ కుమార్ శిష్య బృందంచే శాస్త్రీయ ఆలయ నృత్యాలు. 10 తేదీ గురువారం దుర్గాష్టమి శ్రీ దుర్గాదేవి (మహాగౌరీ) అవతారం. ఉదయం 8 గంటలకు శ్రీ మహా దుర్గ పూజ అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ. సాయంత్రం 6 గం.లకు అమ్మవారి సన్నిధిలో బతుకమ్మ పూజలు. 11తేదీ శుక్రవారం మహార్నవమి - శ్రీ మహిషాసురమర్ధిని దేవి (సిద్ధి రాత్రి) అవతారం ఉదయం 8 గం.లకు శ్రీ మహిషాసురమర్ధిని దేవి పూజ, అమ్మవారికి పసుపు కుంకుమతో అలంకరణ, రుద్ర సహిత చండీ హెూమం. సాయంత్రం 7 గంటలకు మహిషాసుర సంహారం. 12 వ తేదీ శనివారం శ్రీ రాజరాజేశ్వరి దేవి పూజ (విజయదశమి), ఉదయం 8 శ్రీ రాజరాజేశ్వరి పూజ, శమీ పూజ. ఉదయం 9 గంటల నుండి వాహన పూజలు జరగనున్నాయి. అలాగే ప్రతిరోజు రాత్రి 9 గం.ల నుండి అమ్మవారి సన్నిధిలో దాండియా కార్యక్రమం నిర్వహించనున్నారు.

నవరాత్రుల్లో ప్రతిరోజు అమ్మవారి దర్శనం సర్వ కష్ట నివారణం, మహాపుణ్యదాయకం అయినందున సమస్త హిందూ బంధువులందరూ నవరాత్రి ఉత్సవాల్లో, పూజా కార్యక్రమాల్లో పాల్గొని జగదాంబ మూర్తుల కరుణాకటాక్షాలకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.



## "భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి.. భావితరాలకు పునాది మెట్లు కావాలి

### భువనగిరి మున్సిపల్ చైర్మన్ పొతంశెట్టి వెంకటేశ్వర్లు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి.. భావితరాలకు పునాది మెట్లు కావాలని మున్సిపల్ చైర్మన్ పొతంశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. వన మహొత్సవం కార్యక్రమంలో భాగంగా భువనగిరి మున్సిపల్ పట్టణంలోని 29 వార్డులో ఆదివారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి వన మహొత్సవము కార్యక్రమంలో రెండు లక్షల మొక్కల పంపిణీ చేయాలని చెప్పి జూనియర్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో అనడం జరిగిందనీ, అట్టి ఆదేశాల మేరకు భువనగిరి మున్సిపల్ పట్టణంలో రెండు లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని తీసుకుందన్నారు. పట్టణంలో ఇంటింటికీ అవసరమైన పండ్ల చెట్లు , పూల చెట్లు ఇతర అవసరమైన ఆరు మొక్కలు అందజేస్తామన్నారు. ఆయా మొక్కలను నాటి కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రెండేసి మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడం మన జీవితంలో భాగస్వామ్యం కావాలని,అది మనలో భాగం కావాలన్నారు. ప్రభుత్వ ప్రకారంగా మొక్కలు పంపిణీ జరుగుతుందని, మన జీవితంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. సమాజంలో రేపటి తరానికి కాలుష్యం రాకుండా ఉండేందుకు మొక్కలు నాటాలన్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే మొక్కలు నాటి సామాజిక బాధ్యతగా భవిష్యత్ తరాన్ని కాపాడాలన్నారు . ఈకార్యక్రమం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేష్,గ్యాస్ చిన్న కంసాని వెంకటేష్,డాక్టర్ కిరణ్ , సామల భాస్కర్,బాలకృష్ణ, బట్టు మహేందర్,పొతంశెట్టి మంజుల తదితరులు పాల్గొన్నారు.



## సహచర జర్నలిస్టులకు భువనగిరి ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడు అండ

### సొసైటీ ప్రధాన కార్యదర్శి గంధమల్ల రాజు,కోశాధికారి ఆరే కుమార్

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ఆపదలో ఉన్న సహచర జర్నలిస్టులకు యాదాద్రి భువనగిరి ప్రెస్ (క్లబ్) సొసైటీ ఆర్థిక సహాయం అందజేసి వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సొసైటీ ప్రధాన కార్యదర్శి గంధమల్ల రాజు,కోశాధికారి ఆరే కుమార్ అన్నారు. భువనగిరిలో ఇటీవల అనారోగ్యానికి గురైన సహచర జర్నలిస్ట్ లు దండు క్రిష్ణ,సురుపంగ కుమార్లకు ఒక్కరికీ 5వేల చొప్పున ఇద్దరి జర్నలిస్ట్ లకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు కూరెళ్ళ మల్లేశం చారి, లక్ష్మీనారాయణ చారి,భువనగిరి కిషన్,షానూర్ బాబా,నిమ్మల సురేష్ గౌడ్,గోపి మహేష్ పాల్గొన్నారు.

## ఆన్లైన్లో చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

భీమదేవరపల్లి వాయిస్ టుడే సెప్టెంబర్ 29: భీమదేవపల్లి మండలం మల్కనూరు గ్రామానికి చెందిన మాడుగుల అనిల్(29) అనే వ్యక్తి డిగ్రీ చదివి నిరుద్యోగిగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఉపాధి కోసం వివిధ రకాల యాప్ లు,బ్యాంకుల ద్వార సుమారు 9 లక్షలు అప్పు చేసి టాటా ఏసీ ఆటో ద్వారా బీమారంలో మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. ఈక్రమంలో టిఫిన్ సెంటర్ పర్వాలేదు అనిపించిన తర్వాత క్రమక్రమంగా నష్టాలు రావడంతో అవ్యాపారం మానే సి ఇంటి వద్దనే ఉండేవాడు. అనంతరం తిరిగి 2నెలల క్రితం మరింత అప్పుచేసి మల్కనూర్లో అమరవీరుల స్థూపం వద్ద పాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇక్కడ కూడా షాప్ నడువకపోవడంతో అప్పులు చెల్లించడానికి ఫోన్లో ఉన్న వివిధ యాప్ ల ద్వారా అప్పు తీసుకున్నాడు. అప్పులు కట్టలేక మనస్తాపం చెంది ఈ నెల 28న రాత్రి రైతు వేదిక వద్ద ఉన్న క్రీడా ప్రాంగణంలో పురుగుల మందు సేవించానని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు వచ్చి చికిత్స నిమిత్తం MGM ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి వినోద ఫిర్యాదు మేరకు ఎస్సై కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కోరేంలో రెండవ రోజు కొనసాగిన బతుకమ్మ పాట చిత్రీకరణ

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి సెప్టెంబర్ 29: బోయినపల్లి మండలం లోని కోరెం గ్రామంలో జీడియెల్ ఛానల్ మ్యూజిక్ వారి రాజ్ నరేంద్ర దర్శకత్వంలో బతుకమ్మ రెండవ పాట రెండవ రోజు చిత్రీకరణ కొనసాగింది ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ నరేంద్ర మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలను తెలిపే అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ ఇట్టి పండుగను ముందస్తుగానే ప్రేక్షకులకు అందించాలని ఉద్దేశంతో మాట్లా తిరుపతి రాశించిన పాటలో గాయకులు వాగ్దేవి , ఆలపించిన మంచి పాటను చిత్రీకరించామని తెలిపారు .అందమైన లోకేషన్లలో ఈ పాటను చిత్రీకరించినట్లు తెలిపారు ఇందులో నాగదుర్గ ప్రధాన పాత్రలో నటించగా కెమెరామెన్ కమ్లి పటేల్ కొరియో గ్రఫీ చరణ్ వారియర్ లతో పాటు డ్యాన్సర్ లు గ్రామస్తులు జంపుక ఆనంద్,కొమ్ముల ఆనంద్ రెడ్డి ,గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పార్టీ వాళ్లకు లాగులు తడుస్తున్నాయి

**కేటీఆర్ వ్యాఖ్యలకు సవాల్ విసిరి నయీంనగర్ బ్రిడ్జి పైకి వచ్చిన ఎమ్మెల్యే నాయిని**

**చదువుకున్న సంస్కారహీనుడు కేటీఆర్..**

**నయీంనగర్ బ్రిడ్జి బీఆర్ఎస్ నిర్మించిందని ఒక్కరు చెప్పిన రాజీనామ చేస్తా**

**అభివృద్ధి చేయాలేని దద్దమ్మలు హరీష్ రావు, కేటీఆర్**

**కేటిఆర్ దమ్ముంటే వరంగల్‌కి వచ్చి అభివృద్ధిపై చర్చించాలి**

**మద్రాస్ బాబునీ మాటలు ఇంకా ప్రజలు వినే స్థితిలో లేరు..**

**వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: హనుమకొండ అభివృద్ధి విషయంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విసిరిన సవాల్ కి ఆదివారం ఉదయం 10గంటలకు హనుమకొండ నయీం నగర్ బ్రిడ్జి పైన వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధారాలతో, భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కార్యకర్తలతో మీడియా ముందుకు వచ్చారు. తనకు ప్రజలు అభిమానంతో చేసిన పూలభిషేకం విషయంపై విచక్షణ కోల్పోయి మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ మాటలకు దీటుగా ఎమ్మెల్యే నాయిని సమాధానం ఇచ్చారు. అభివృద్ధి అనగానే బీఆర్ఎస్ పార్టీ వాళ్లకు లాగులు తడుస్తున్నాయని నాయిని ఎద్దేవాచేశారూ. చదువుకున్న సంస్కారహీనుడు కేటీఆర్ వాడు వీడు అనే పదజాలం వాడుతున్నారు ఇదేనా మీ సంస్కారం అని నాయిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే మీరు కట్టారు అనడం నీ రాజకీయ వివేకానికి వదిలేస్తున్నని నాయిని అన్నారు. మీ మాదిరి మాటలు చెప్పే తత్వం నాది కాదు అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధారాలు బయటపెట్టారు. తాను 3రోజుల క్రితం విసిన సవాల్ ప్రకారం మాట తప్పకుండా ఈరోజు 10గంటలకు వచ్చినాని నాయిని తెలిపారు. నయీంనగర్ బ్రిడ్జి బీఆర్ఎస్ వాళ్ళు నిర్మించారని ఒక్కరు చెప్పిన రాజీనామ చేస్తానని, దొంగ యుట్యూబ్ ఛానెల్ తో పబ్బం గడిపే మీరు మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు లేదని ఎమ్మెల్యే నాయిని ధ్వజమెత్తారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ పక్కద్రోవ పట్టించేందుకు దొంగ యుట్యూబ్ ఛానెల్ లతో కేటీఆర్ అండ్ బీఆర్ఎస్ టీం పబ్బం గడుపుతున్నారు అని నాయిని విమర్శించారు.

నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ మొదటి దశ నుంచి స్థానిక బీజేపీ పార్టీ కార్పొరేటర్, స్థానిక ప్రజలు ఉన్నారని.. ప్రతి రోజు నేను, మేయర్, కలెక్టర్, బల్దియా కమీషనర్ ఇతర అధికారులంతా పర్యవేక్షించామని నాయిని తెలియజేశారు. ఎన్నికల్లో ప్రజలు పక్కనబెట్టిన మీ బుద్ధి ఇంకా మారలేదు, మీ అహంకారం ఇంకా పోలేదు అని.. పొద్దున లేస్తే అభివృద్ధి జీర్ణించుకోలేక ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి చేయాలేని దద్దమ్మలు హరీష్ రావు, కేటీఆర్ మీ మొహాలకు ఏనాడైనా స్వతంత్రంగా పోయి ముఖ్యమంత్రిని నిధులు అడిగిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. మీ మాటలు కోటలు దాటుతాయి చేతలు వాకిలి కూడా దాటలేవు అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఎద్దేవాచేశారు. నేను ఏనాడు పూలభిషేకం కోరుకోలేదు అని.. ప్రజలు తమ అభిమాని ఆ రూపంలో చూపించడం పట్ల మీకు కడుపు మంట అన్నారు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి. మీ మాదిరి ఏ రోజు కూడా కాళ్ళు మొక్కిచ్చుకునే తత్వం మాది కాదు అని కేటిఆర్ ను ఉద్దేశించి మాట్లాడారు. బిడ్డ కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో.. నేను మాటలలో డబుల్ పీజీ చేసిన.. నేను నోరు తెరిస్తే నువ్వు నీ స్టూవర్టుపురం బ్యాచ్ ఉండదని, కేటీఆర్ కు చేసే పనులకు నిజంగా కిల్ బిల్ పాండే బిరుదు సరిగా ఉంటుందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని నువ్వైనా.. నీ చెంచలైన నయీం నగర్ బ్రిడ్జి నిర్మాణం ఎవరు చేపట్టారో ప్రజలకు తెలపాలని, కేటిఆర్ కు దమ్ముంటే నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం నగర అభివృద్ధిపై వరంగల్ కు వచ్చి చర్చించాలని ఎమ్మెల్యే నాయిని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ రోజు మంత్రులు, ఎమ్మెల్యేలం అభివృద్ధి దిశగా వెళ్తుంటే మీకు ఒంట పట్టడం లేదని, మీ ఫామ్ హౌస్ లు పోతున్నాయనే భయంతో హైడ్రా పై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే నాయిని అన్నారు. మీ పదేళ్ల పాపానికి ప్రాయశ్చిత్తంగా మేము హైడ్రా తో పవిత్రం చేస్తున్నామన్నారు. మద్రాస్ బాబు నువ్వు నీ మాటలు ఇంకా ప్రజలు వినే స్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఉద్దేశించారు. 95% శాతం పనులను మేము చేశాం అని చెప్తుంటే ఈ రోజు దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు ఎమ్మెల్యే నాయిని. సింగిల్ చెక్ ద్వారా 45కోట్ల పై చిలుకు నిధులను కేటాయించి ఈ రోజు కాళోజీ కళాక్షేత్రం నిర్మించిన ఘనత మాది అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం స్పందించి వెంటనే సీనియర్ కాంటాక్ట్ లెక్చరర్‌లకు రీసెర్చ్ పర్మిషన్ ఇవ్వండి

**నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్**



తొర్రూర్ సెప్టెంబర్ 29 వాయిస్ టూడే: అడ్మిన్ స్ట్రేషన్ ఆఫీస్ లో జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ నిర్వహించిన విలేకరు ల సమావేశం లో వారు మాట్లాడుతూ.,దేశం లో అన్ని యూనివర్సిటి లో కాంట్రాక్ట్ లెక్చరర్స్ కు రీసెర్చ్ పర్మిషన్ ఇవ్వక పోవడం వల్ల దేశం లో రీసెర్చ్ వ్యవస్థ కుంటు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు,యూనివర్సిటీ లో ఎంతో మంది విద్యార్థుల కు రీసెర్చ్ పరిశోధన చేసు కున్న అవకాశం లేక పోవడం వల్ల విద్యార్థుల అస్తవ్యస్తాని కి గురవుతున్నారు,యూనివర్సిటీ లో ప్రొఫెసర్ 60 సంవత్సరాలు కు రిటైర్ అవు తున్నారు తర్వాత ఐదు 05 సంవత్సరాలు వారి కి ఎక్స్ ట్రా పర్మిషన్ ఇవ్వడం జరుగు తుంది.దీని వల్ల వారి కి అనారోగ్య సమస్య లు రావడం వల్ల గైడ్ చేయడాని కి ఒప్పు కోవడం లేదు,దాని వల్ల నైపుణ్యం కలిగిన కాంట్రాక్ట్ లెక్చరర్ కు రీసెర్చ్ పర్మిషన్ ఇస్తే ఇలాంటి సమస్య ఉండదని అన్నారు.విద్యార్థుల కు కావలసిన ఉద్యోగాలు ఇవ్వ కున్న కనీసం రీసెర్చ్ చేసు కునే అవకాశం,ప్రభుత్వం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది,ఎంతో మంది కాంట్రాక్ట్ లెక్చరర్ లు 60 సంవత్సరాలు నిండిన కూడ కాంట్రాక్ట్ లెక్చరర్ గానే చివరి కి రిటైర్ మెంట్ అవు తున్నారని వారి కి రిటైర్ మెంట్ చివరి అవకాశం లో వారి అనుభవం తగ్గట్టు రీసెర్చ్ మరి కొంత మంది విద్యార్థుల కు కల్పిస్తే భవిష్యత్ తరాల వారి కి పెద్ద పీట వేసినట్టు అవుతుందని అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వం,వెంటనే నిర్ణయం తీసు కొని ప్రత్యేక కమిటీ వేసి జిఓ జారీ చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ని కోరడం జరిగింది,



## రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు

తొర్రూర్ సెప్టెంబర్ 29 వాయిస్ టూడే: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్ 19 షూటింగ్ బాల్ ఆటల పోటీలకు మహబూబాబాద్ జిల్లా తరపున ఆడేందుకు శనివారం రోజు నెల్లికుదురు జడ్ పి హెచ్ఎస్ పాఠశాల నందు,నిర్వహించిన,మహబూబాబాద్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సెలక్షన్స్ లో తొర్రూర్ డివిజన్ కేంద్రం లోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు బానోత్ మధు,లునావత్ హరికృష్ణ లు ఉత్తమ ప్రతిభ ను కన బరిచి రాష్ట్ర స్థాయి లో ఆడేందుకు మహబూబాబాద్ జిల్లా జట్టు కు ఎంపికయ్యారు.ఈ సందర్భం గా సిద్ధార్థ హైస్కూల్ కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్ జిల్లా జట్టు కు ఎంపిక ఐన మధు,హరికృష్ణ ల ను ప్రత్యేకం గా అభినందించారు.ఈ సందర్భం గా జయప్రకాష్ మాట్లాడుతూ.,సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీ ల లో పాల్గొనడం తమ కు,తమ స్కూల్ విద్యార్థుల కు గర్వ కారణమని,నిరు పేద కుటుంబం లో పుట్టిన విద్యార్థులు కష్ట పడి ఆట లో తమ ప్రతిభ ను కన బరిచి రాణించడం ఎంతో గొప్ప విషయమని కొని యాడారు. రాష్ట్ర స్థాయి పోటీ ల లో కూడ మధు హరికృష్ణ లు రాణించి జాతీయ స్థాయి లో పాల్గొనే జట్టులో కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు.



## శ్వేతార్క ఆలయ అర్చకులు సాయి కృష్ణ శర్మకు సన్మానం

వాయిస్ టుడే, కాజీపేట: కొండగట్టు గ్రామంలో నిర్వహించిన బ్రాహ్మణ సంక్షేమ వేదిక కార్యక్రమంలో భాగంగా 12 దేవాలయాల అర్చకులకు సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయాల పరిరక్షణ బ్రాహ్మణ సంక్షేమ విషయాలు మరియు బ్రాహ్మణ ఐక్యత కొరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖమైన 12 దేవాలయాల అర్చకులకు సన్మాన కార్యక్రమాన్ని జరుపగా కాజీపేట లో గల తెలంగాణ గణపతిగా భాసిల్లుతున్న శ్వేతార్క గణపతి ఆలయ ప్రతినిధిగా వెళ్లినటువంటి ఐనవోలు సాయి కృష్ణ శర్మకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున బ్రాహ్మణ సంఘం వారు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చినటువంటి బ్రాహ్మణులు 12 దేవాలయాల నుంచి వచ్చిన అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని పరామర్శించిన ఛైర్మన్ జంగా

**అంతిమయాత్రలో పాల్గొన్న రాఘవరెడ్డి**



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి అనారోగ్యంతో మరణించగా ఆయన భౌతికకాయానికి స్టేట్ ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని జంగా రాఘవ రెడ్డి పరామర్శించారు. అనంతరం జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానం లో జరిగిన దహనసంస్కారాల్లో రాఘవ రెడ్డి పాల్గొన్నారు.




## డిజీల్ కాలనీ దసరా ఉత్సవాలు ప్రారంభం

వాయిస్ టుడే, కాజీపేట: దసరా ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం కాజిపేట్ డీజిల్ కాలనీ (శాంతినగర్) రైల్వే ఇనిస్టిట్యూట్ ఆవరణలో దసరా ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో రావణాసుర తయారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలుగా తాము సొంతగా రావణాసుర విగ్రహం తయారుచేస్తున్నామని, ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తుగా విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అక్టోబర్ లో దసరా రోజున భారీస్థాయిలో ఉత్సవాలు ఏర్పాటుచేసి రవణాసుర దహన కార్యక్రమం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ సభ్యులు గైక్వాడ్ సదూరం , సాల్మన్ రాజ్, జగదీశ్వర్ రావు, జానీమియా, దగల ఎల్లేష్, రాముల సదానందం, ప్రదీప్ లొంధే, కిరణ్, దాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలి

**తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వర రావు**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే సెప్టెంబర్ 29: కొత్తగూడెం మున్సిపాలిటీ,పాల్వంచ మున్సిపాలిటీ నీ కలిపి అందులో మరి కొన్ని మండల లో లక్ష్మీదేవిపల్లి ,చించుపల్లి ,సుజాతనగర్ లో కొన్ని ఏజెన్సీ గ్రామాలను కలుపు కొని మున్సిపల్ కార్పొరేషన్ చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని అన్నారు, పై మూడు మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నవి అవి 5వ శడ్యూల్డ్ భూభాగం లో ఉన్న ప్రాంతాలు 1/70 చట్టం , పేసా చట్టం అమలులో ఉన్న ప్రాంతం , ఈ చట్టాలకువిరుద్ధంగా ఏజెన్సీ భూభాగాన్ని అబివృద్ధి పేరిట విధ్వంసానికి పాల్పడటం మానుకోవాలని అన్నారు. ఇంక అభివృద్ధికి నోచుకోని ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల విద్య,వైద్యం,ఉపాది అందక సతమతం అవుతుంటే ప్రభుత్వాలు కార్పొరేషన్ చేయటం వలన ఏజెన్సీ హక్కులు చట్టాలు కోల్పోతామని, ఏజెన్సీ ప్రాంతాలను విడగొట్టలనే ప్రయత్నం మానుకోవాలనీ ,అధికారులకు ఆదివాసీల మీద చిత్త శుద్ధి ఉంటే ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని, 5వ శాడ్యూల్డ్ భూభాగం ఆదివాసీలకు కన్న తల్లితో సమానం అని అటువంటి కన్న తల్లి జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు తమ చట్టాలు హక్కులు కాపాడుకోవటం కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు పోరాటాలు చేపడతామని అన్నారు.

## ‘అమీర్ అలీ’ ఫౌండేషన్ సేవలు భేష్

**బైక్ మెకానిక్ రాముకు బాసటగా నిలవడం అభినందనీయం**

**హమీద్ షేక్ వాట్సాప్ గ్రూప్స్‌లో షేర్ చేసిన రాము అభ్యర్థనపై స్పందించిన సమాజసేవకులు**



మిర్యాలగూడ సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే ) మిర్యాలగూడ పట్టణానికి చెందిన అమీర్ అలీ ఫౌండేషన్ సేవలు భేష్ అని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ కొనియాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బైక్ మెకానిక్ రాము కుటుంబానికి అమీర్ అలీ ఫౌండేషన్ బాసటగా నిలవడం స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. కాగా, ప్రమాదంలో గాయపడిన రాము తమ కుటుంబానికి సాయం అందించాల్సిందిగా హమీద్ షేక్ వాట్సాప్ గ్రూప్స్ ద్వారా సభ్యులను అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనపై ఇప్పటికే పలువురు దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించారు. తాజాగా, అమీర్ అలీ ఫౌండేషన్ రాము కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చింది. మిత్రులు తాజ్ బాబా, సందీప్ తో కలిసి అమీర్ అలీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అమీర్ అలీ రాము నివాసానికి చేరుకున్నారు. 25 కేజీల బియ్యం బస్తా, నెల రోజులకు సరిపడ నిత్యావసర సరుకులను పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. రాము త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మానవతా ధృక్పథంతో సాయం అందించేందుకు ముందుకొచ్చిన అమీర్ అలీ ఫౌండేషన్ కు, ఆర్థిక సాయం అందించిన దాతలకు, హమీద్ షేక్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌కే అవమానం జరిగింది

**ఇక సాధారణ ప్రజలకి ఏమి న్యాయం చేకూరుతుంది**

**బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా ఎస్ సీ సెల్ నాయకులు బంకా మల్లయ్య**



ముదిగొండ మండలం సెప్టెంబర్ 29 వాయిస్ టుడే: రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కి ప్రోటో కాల్ విషయంలో అతనికి రెండుసార్లు అవమానం జరగడం పట్ల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ఫీ విబాగ ఖమ్మం జిల్లానాయకులు బంకా మల్లయ్య తీవ్రంగా మండిపడ్డారు..కమీషన్ చైర్మెన్ నే స్వయంగా తనకు అవమానం జరిగిందని మీడియా ముందు చెప్పుకోవడం ఈ ప్రభుత్వం కుల వివక్షతను బహిరంగంగా చూపడానికి ఇంతకంటే నిదర్శనం ఏమటని ఆయన ప్రశ్నించారు!? మెదక్ జిల్లాలో మంత్రులు ఇన్చార్జి మంత్రులు జిల్లా కలెక్టర్ తో సహా తనను అవమానపరిచారని స్వయంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ గా ఉన్న బక్కి వెంకటయ్య మీడియా ముందు వాపోయారని దళితులకు కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారికి కమిషన్ చైర్మన్ గా ఉన్న వారికే ఇలా అవమానానికి గురైతే సాధారణ దళిత కార్యకర్త నాయకుడు ప్రజాప్రతినిధికి ఏం న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆలోచించాలన్నారు..ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య కుల వివక్షతకు గురి చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు ఎస్సీ వర్గీకరణ పై జ్యుడీషియల్ కమిషన్ పేరుతో కాలయాపన సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ విషయమై హక్కులు కల్పించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఇప్పుడు కొత్తగా ఎస్సీ వర్గీకరణ పై జ్యుడీషియల్ కమిషన్ వేస్తామని అందులో కుల సంఘాల తమ అభిప్రాయాలు చెప్పుకోవచ్చు అని చెప్పడం కాలయాపనకు నిదర్శనమని బంక మల్లయ్య ఆరోపించారు.. తక్షణమే కాలయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విద్య కాషాయకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

## పీ డి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు



కాకినాడ, సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి) దేశంలో కుల నిర్మూలన కోసం మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్ధు అన్నారు. కాకినాడ పట్టణంలోని బిసి బాయ్స్ కాలేజీ హాస్టల్ నెంబర్ 2 , కాకినాడ ఎస్సీ బాయ్స్ కాలేజీ హాస్టల్ లో పిడిఎస్యు జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు ఆదివారం సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి వి. భీమ శంకర్, పిడిఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు, కాకినాడ ఎస్సీ బాయ్స్ కాలేజీ హాస్టల్ వార్డెన్ ఎం. ప్రసాద్ బాబు ,సామర్లకోట ఎస్సి బాయ్స్ చైల్డ్ హాస్టల్ వార్డెన్ వర్మ , పీ.వై.ఎల్ జిల్లా నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశంలోని నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ నిర్మూలన కోసం మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భవ వారోత్సవాల సందర్భంగా దేశంలోని హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిడిఎస్యు జాతీయ కార్యవర్గం పిలుపునిచ్చింది. కుల, లింగ వివక్షత దేశంలోని లౌకికవాదానికి, ప్రజాస్వామానికి వ్యతిరేకమన్నారు. వాటి నిర్మూలన కోసం 1873 సెప్టెంబర్ 24న పూణేలో మహాత్మ జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ స్థాపించారన్నారు. అందులో భాగంగా కుల నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 24 నుండి 30 వరకు కుల నిర్మూలన అవగాహనసదస్సులు ,సభలు ,ప్రదర్శనలు ,సహపంక్తి భోజనాలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలని పి డి ఎస్ యు జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ పిలుపులో భాగంగా దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం దళితులపై ,ఆదివాసీలపై, మైనారిటీలపై తీవ్రమైన దాడులు చేస్తున్న వారిని శిక్షించకుండా కాలయాపన చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా అడవులు నుండి ఆదివాసులను గెంటివేసి, ఆదివాసిల అడవి ఖనిజ సంపదలను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని తెలిపారు. దళిత మహిళలపై అత్యాచారాలు హత్యలు, దాడులు పెట్రేగిపోతున్న వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యారని తెలియజేశారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా కాషాయకరణ చేసి విద్యార్థులలో బ్రాహ్మణీయ భావజాలాన్ని చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకొని, విద్యార్థులకు లౌకిక, ప్రజాస్వామిక విలువలు పెంపొందేల పాఠ్యాంశాన్ని రూపొందించాలని తెలిపారు. తక్షణమే ఎన్నికల్లో ఇచ్చినటువంటి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి. శేఖర్, జి శ్రీనివాస్, మణికంఠ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి ఇవ్వాలి: సిపిఎం డిమాండ్



భద్రాచలం, సెప్టెంబర్ 29 (వాయిస్ టు డే ) భద్రాచలం పట్టణంలో నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికీ ఇవ్వాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం కుర్రాజులగుట్ట, డబుల్ బెడ్ రూమ్ ( కెసిఆర్ కాలనీ) కొమరం భీమ్ శాఖ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ పాలకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణంలో జాప్యం చేసి ప్రజలకు పంపకం చేయకుండా వదిలేశారని విమర్శించారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి 9 నెలలు గడుస్తున్న నేటికీ వాటి అమలుకు పూనుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇండ్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించిందని అనేకమంది పేదలు సొంత ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం ఆ పథకాన్ని ప్రారంభించాలని ఆయన కోరారు. భద్రాచలం పట్టణంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం పతాకాన్ని మాజీ వార్డ్ మెంబర్ మడెం లక్ష్మి ఎగురవేసారు. సిపిఎం పట్టణ నాయకులు వై . వెంకట రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, వుస్తేల జ్యోతి , కుంజ శ్రీనివాస్, శాఖ కార్యదర్శులు కాపుల లక్ష్మి, సున్నం ప్రవీణ్, సభ్యులు కాపుల దుర్గారావు, కుంజా విజయ, సుభాష్ పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి అక్షర ప్రతిభ పురస్కారం అందుకున్న డప్పు కళాకారుడు అమరవరపు సతీష్

గరిడేపల్లి సెప్టెంబర్ 29( వాయిస్ టుడే): సూర్యాపేట జిల్లా కేంద్రం శ్రీ లక్ష్మి గార్డెన్స్ లో అక్షర ఫౌండేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శ్రీ లక్ష్మి గార్డెన్స్ లో రాష్ట్ర స్థాయి అక్షర ప్రతిభ పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ సాంస్కృతిక విభాగంలో ఉత్తమ డప్పు కళాకారుడిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా వాస్ దేవ్, అక్షర ఫౌండేషన్ పౌండర్ %ం% చైర్మన్ యాస రామ్ కుమార్ రెడ్డి %ం% ఫౌండేషన్ యాజమాన్యం చేతులు మీదుగా రాష్ట్ర స్థాయి ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ అవార్డు పొందడం పట్ల కుటుంబ సభ్యులు, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్,జానపద కళాకారులూ సంఘం జిల్లా అధ్యక్షులు గుండ్ల ఆంజనేయులు, టియస్ యస్ జిల్లా అధ్యక్షులు వెన్నెల నాగరాజు, బండారు వీరు నాయుడు, ఉప్పల నాగార్జున, సతీష్ డప్పు కళా బృందం సభ్యులు, గ్రామస్తులు సతీష్ కీ అభినందనలు తెలిపారు.



## ఆదివాసీ ప్రాంతంలో తగ్గుతున్న వ్యవసాయ దిగుబడి!

### ఏ.ఎస్.డి.ఎస్ గాంధిబాబు

భద్రాచలం, సెప్టెంబర్ 29 (వాయిస్ టు డే ). ఆదివాసీ ప్రాంతం లో మారిన పరిస్థితుల్లో వ్యవసాయ దిగుబడు లు తగ్గుతున్నాయని ఏ.ఎస్.డి.ఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధిబాబు పేర్కొన్నారు. జాతీయ స్థాయి వ్యవసాయ సంక్షోభం సదస్సులో ఆదివాసీ ప్రాంత వ్యవసాయం గురించి ఆయన ప్రసంగించారు. తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్ మూడు రాష్ట్రాల వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థాగత హింస అనే అంశంపై ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. ఉస్మానియా యునివర్సిటి లో జరిగిన ఈ సదస్సు లో ఏజెన్సీ ప్రాంతం నుండి వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ (ఏ.ఎస్.డి.ఎస్) వ్యవస్థాపక అధినేత ఉండవల్లి గాంధిబాబు మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతములో సమస్యలు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, మానవ తప్పిదాల వలన విపత్తులు గురించి ఆయన మాట్లాడారు.

ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతంలో వ్యవసాయ కేలండర్ మారిపోఇందని చెప్పారు. సరైన సమయంలో విత్తనాలు వేయలేక, సకాలం లో వర్షాలు లేకపోవడంతో దిగుబడి తగ్గి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు తో నదులు, వాగుల వరదల వలన రవాణా సౌకర్యం లేకపోవడము, వ్యవసాయ పనులు లేకపోవడము వంటి కారణాల వలన వ్యవసాయ కూలీలు అనేక ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళలపై ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, పిల్ల తల్లులు, కిశోర బాలికలు పోషకారాన్ని కోల్పోతున్నారు. తల్లీపిల్లల మరణాలు, మాల్ న్యూట్రిషన్ శాతం పెరగడం వలన అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవి అన్నిటికి మూలంగా మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ విషయాలపై ఒక సమగ్ర స్టడీ జరగాలని సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమములో మూడు రాష్ట్రముల నుండి స్వచ్చంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు నూతన మహిళా కమిటీ ఎన్నిక



కోదాడ , సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే) మున్నూరు కాపు సంఘం కోదాడ పట్టణ మహిళ అధ్యక్షురాలుగా రామిశెట్టి కృష్ణవేణి , ఉపాధ్యక్షురాలుగా ఎం దేవి , ప్రధాన కార్యదర్శిగా కోట గురు లక్ష్మి ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నూనె సులోచన , రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ బండ్ల ప్రశాంతి , పట్టణ అధ్యక్షులు సన్నీరు మురళి ఆధ్వర్యంలో నియమించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో వై లక్ష్మీ , చింతలపాటి అరుణ, బండారు ఉమా , ఒరుగంటి రమణ తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలను ఉత్తమ పౌరులుగా తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### మంత్రి కందులు దుర్గేష్..

నిడదవోలు, సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి): పిల్లలను ఉత్తమ పౌరులుగా సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.శనివారం స్థానిక తాలూకా రైస్ మిల్లర్స్ ఫంక్షన్ హాల్ లో జరిగిన "బేటి బచావో - బేటి పడావో" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, బాలల అక్రమ రవాణా నివారణ మనందరిపై ఉన్న బాధ్యత అన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై పిల్లలకి నేర్పాలని, ముఖ్యంగా మగపిల్లలకు అవగాహన కల్పించడం ద్వారా బాధ్యత కలిగిన పౌరు లుగా తీర్చిదిద్దాలని పిలుపు ఇచ్చారు. సోదరి భావంతో కూడిన బయట ఆడపిల్లలతో సత్ ప్రవర్తన కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుబడి ఉండాలని కోరారు. బాలలు తమ ఇబ్బందులూ చెబుతుంటే వినాలని, వినని పక్షంలో వారి హక్కులను హరించిన వారమౌతమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బాలల అక్రమ రవాణా నివారించడం, పౌష్టిక ఆహారం లోపం లేకుండా చూడడం మన బాధ్యత అని, ఇందుకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు వారికీ అందజేయడం జరుగుతోందని తెలిపారు.బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్య విషయంలో అమ్మాయి అబ్బాయి అనే వివక్షా ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు కార్యక్రమం లో పాల్గొన్న మంత్రి వారికి పోషిక ఆహార కిట్లు, చీరలు అందచేశారు. 18 ఏళ్లు నిండిన బాలికలకు వివాహం చేయాలన్నారు, అధికారులు చెప్పినట్లు అప్పుడే వారు పూర్తి స్థాయిలో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్ది, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం అవుదామని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్పిడి కే విజయ్ కుమారి, నిడదవోలు మున్సిపల్ కమిషనర్, తాసిల్దారు బి నాగరాజు నాయక్, స్థానిక అధికారులు ప్రజాభినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ఆర్ ఎస్ ఆర్ భారతీయ అంతరిక్ష వారోత్సవాలు

నెల్లూరు, సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి) భారతీయ అంతరిక్ష వారోత్సవాలు పురస్కరించుకొని స్థానిక స్టోన్ హౌస్ పేట లో ఉన్న ఆర్ ఎస్ ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల లో విద్యార్థులచే రాకెట్, శాటిలైట్ , ప్లానెట్స్, సోలార్ సిస్టమ్ నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వివిధ నమూనాలను చేసుకొని వచ్చి ప్రదర్శించి వాటి గురించి వివరించారు. చివరగా అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 10 వరకు ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు' జరుపుకోనున్నట్లు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.మన పాఠశాలలకు అక్టోబర్ 2 నుంచి సెలవలు ఉన్నందు వల్ల మనం ముందుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం అని తెలిపారు. చక్కని ప్రదర్శనలకు మురిగిపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.




## జె.ఎ.సి.ఆధ్వర్యంలో హృదయ దినోత్సవం

నెల్లూరు, సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి) ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా జె.ఎ.సి.మరియు నారాయణ మెడికల్ కళాశాల మరియు హాస్పిటల్ సహకారంతో స్థానిక స్టోన్ హౌస్ పేట లోని జె.సి.భవన్ లో హృదయారోగ్యం మీద ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నారాయణ హాస్పిటల్ కార్డియాలజీ డిపార్ట్మెంట్ తరపున డాక్టర్ రాం కుమార్,డాక్టర్ తిలక్ కుమార్ రెడ్డి,డాక్టర్ అరున్ కాంత్ తదితరులు హృదయ సంబంధ వ్యాధులు, వాటి లక్షణాలు, హృదయ సంబంధ వ్యాధులు రాకుండా తీసుకోవలచిన జాగ్రత్తలు వివరించారు. పొగ త్రాగడం, మద్యం తాగడం మానివేయడం యోగ, ప్రాణాయామం షుగర్,బీపీని కంట్రోల్ గా ఉంచుకోవడం హృదయ సంబంధ వ్యాధుల నివారణ కు ఉపయోగపడతాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణ మెడికల్ కళాశాల ఎ. జి. ఎం.శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జె. ఎ. సి.నేషనల్ డైరెక్టర్ సత్యనారాయణ, జోన్ ట్రెజరర్ పి.సత్యనారాయణ, రీజినల్ చైర్మన్ శరణ్ కుమార్,జోన్ డైరెక్టర్మధు బాబు మురిగిపూడి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం సతీష్ కుమార్, జె.సి.ఐ. అధ్యక్షుడు రాం, జె.సి. ఐ.సభ్యులు పాల్గొన్నారు. జె.సి. ఐ. సభ్యులకు నారాయణ హాస్పిటల్స్ తరపున తక్కువ ధరకు ప్రత్యేక ప్యాకేజీని అందిస్తామని శేఖర్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



## టీ జీ టీ డబ్ల్యు ఆర్ కళాశాలలో విద్యార్థినుల శ్రమదానం

భద్రాచలం, సెప్టెంబర్ 29 ( వాయిస్ టు డే ). భద్రాచలం చర్ల రోడ్డులో గల టీజీటీ డబ్ల్యు ఆర్ కళాశాల లో శనివారం విద్యార్థినులు శ్రమదానం చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం లో భాగంగా ఐటీసీ వావ్ సంస్థ ( ఈశ్రీ - ఫౌండేషన్ ) ఆధ్వర్యంలో విద్యార్థినులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలశాల లో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత, పరిశుభ్రత చాలా ముఖ్యమని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని విద్యార్థినులకు ఆమె సూచించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో , వావ్ సంస్థ కో - ఆర్డినేటర్ రమ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్స్ సౌజన్య, రాజేశ్వరి, సీఆర్పీలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం

హైదరాబాద్
సోమవారం, 30 సెప్టెంబరు 2024



## న్యూ లక్ష్మీపురంలో రగ్బీ శిక్షణా శిబిరం ప్రారంభం

ముదిగొండ మండలం సెప్టెంబర్ 29: ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సహకారంతో ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో న్యూ లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న రగ్బీ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంబాని చంద్ర శేఖర్, చెరుకూరి శేషగిరి రావు, దేవరపల్లి అనంత రెడ్డి, వాకదాని కన్నయ్య, మహ్మద్ అజ్గర్, గ్రామశాఖ పల్లెపొంగు రమేష్.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు న్యూ లక్ష్మీపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , గ్రామ ప్రజలు జిల్లా రగ్బీ అసోసియేషన్ ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

చేవెళ్ల..సెప్టెంబర్ 29(వాయిస్ టుడే) శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని 4,5,3,14,12 వార్డులలో శంకర్ పల్లి మున్సిపల్ అధ్యక్షులు బీర్ల సురేష్ అధ్యక్షతన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బిజెపి సభ్యత్వం నమోదును చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా చేవెళ్ల మాజీ శాసనసభ్యులు %ఖు% రత్నం మరియు శంకర్ పల్లి మునిసిపల్ సభ్యత్వం ఇంచార్జ్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మనకిబాత్ కార్యక్రమం లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని ఇచ్చారు. దేశవ్యాప్తంగా బిజెపి మెగా మెంబర్ షిప్ డ్రైవ్ ద్వారా ప్రతి బూత్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నారని, దీనికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, నర్సింహా, మాజీ మునిసిపల్ అధ్యక్షులు జైరాం రెడ్డి, మునిసిపల్ ప్రధాన కార్యదర్శులు ఎర్రోళ్ల రాజ్ కుమార్, మొరంగపల్లి శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎన్ను ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్,బయన్న, వెంకటేష్,వినోద్, శ్రీనివాస్ రెడ్డి, మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



## మానవసేవే మాధవసేవ పొన్నం యువసేన లక్ష్యం

### పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్

వాయిస్ టుడే ప్రతినిధి సెప్టెంబర్ 30 హుస్నాబాద్ నియోజకవర్గ హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో ఇటీవలే అనారోగ్య కారణంతో చనిపోయినటువంటి మామునూరుకొమురయ్య వారి భార్య అయిన లచ్చమ్మ ను మరియు కుమారుడు తిరుపతి చంద్రమౌళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్ అనంతరం మామునూరు కొమురయ్య చిత్రపటానికి ప్రగాఢ శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు సందర్భంగా పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్ ఆకలి కేకలు తెలిసిన వాడిని నిరుపేద కుటుంబాల యొక్క పరిస్థితులలో మెదిలిన వాడిగా నిరుపేద కుటుంబాలంటే ఏటువంటి దినస్థితిలు ఉంటాయో తెలిసిన వాడిని కావున నిరుపేద కుటుంబాలకు ఉడుతభక్తి సహాయంగా నిరుపేద కుటుంబాలకు సేవే లక్ష్యంగా చేయాలనే లక్ష్యంతో పొన్నం యువసేన అనే పేరుతో కార్యక్రమలు మండలంలో ఉన్నటువంటి నిరుపేద కుటుంబాలకు సహాయం చేస్తూ వస్తున్నానని ఇట్టి కార్యక్రమాలు నిరుపేద కుటుంబాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని ఏటువంటి కులము మతము రాజకీయ భేదాలు లేకుండా ప్రతి నిరుపేద కుటుంబానికి చేస్తున్నటువంటి సేవా కార్యక్రమం చేస్తున్న సహాయము ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యము పొన్నం యువసేన యొక్క లక్ష్యమని తెలిపారు ఈ కార్యక్రమంలో సూరారం గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్ రావు మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు చల్లూరి వేణు పులాటి తిరుమల్ రావు గుండేటి లక్ష్మీనారాయణ మేకల బాబు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు చిలుమల వినోద్ మామునూరు కిషోర్ గాజుల చిరంజీవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీలో వివిధ పార్టీ నాయకులు చేరికలు



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:యాదగిరి గుట్ట మండలం లాప్పనాయక్ తండ గ్రామ పంచాయితీ లో నరేంద్ర మోడి గారి పరిపాలన పథకాలకు ఆకర్షితులై బీజేపీ పార్టీ లో చేరికలు జరిగాయి. యాదగిరి గుట్ట మండల అధ్యక్షుడు గుంటిపల్లి.సత్యనారాయణ ఎస్.టీ. మోర్చ జిల్లా అధ్యక్షుడు కిషన్ నాయక్ ఎస్.టీ మోర్చ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్ ఆద్వర్యం లో టీ.ర్.ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దీరావత్ మాంగ్య నాయక్ మరియు రిటైడ్ బ్యాంకు ఉద్యోగి దీరావత్.మోతీలాల్ నాయక్ బి.జె.పి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

## యాదాద్రిలో భక్తులతో కిటకిటలాడుతున్నా ఆలయం

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం దర్శనం కోసంభక్తులు పోటెత్తిన భక్త జనం..ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.సాధారణ దర్శనం 3గంటలు, ప్రత్యేక దర్శనం 2గంటల సమయం పడుతుందని ఆయన అధికారులు తెలిపారు..భక్తులు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ భాస్కరరావు తెలిపారు.





## జెకే ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉచిత భోజనం వసతి

మహబూబ్ నగర్ జిల్లా సెప్టెంబర్ 29: నవాబుపేట మండల కేంద్రానికి సంత కొరకు ఆదివారం మార్కెట్ చుట్టుపక్కల 54 గ్రామాల నుండి వచ్చే ప్రజల కొరకై జెకే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజనం నాలుగో వారం విజయవంతంగా ముగిసింది కార్యక్రమంలో జెకే ట్రస్ట్ డైరెక్టర్ సుధాకర్ చారి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మరియు మార్కెట్ చైర్మన్ పి . నరసింహ చారి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రచార కార్యదర్శి పుట్టి ఆంజనేయులు . కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టంకర నిరంజన్. శివకుమార్, కాంగ్రెస్ కార్యకర్తలు జోగు చందు. పుట్టి మహేష్ కుమార్. లోకి రేవు. బ్రహ్మచారి మహమ్మద్ నసీరుద్దీన్, జోగు శేషు, దేవరకొండ రఘు, తదితరులు పాల్గొన్నారు



## బీసీ కులగణన తర్వాతనే స్థానిక ఎన్నికలు జరగాలి

### ధర్మ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజు

వాయిస్ టుడే సెప్టెంబర్ 29 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి) సిద్దిపేట జిల్లా రాష్ట్రంలో ఎక్కువ జనాభా బీసీలు కాబట్టే బీసీ కులగణన జరిగిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్ దుబ్బాక నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం బీసీసీ ఎస్టీ ప్రజల్ని మోసం చేసింది అలాగే ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా కులగనన జరపకపోతే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి కూడా పుట్టగతులు లేకుండా పోతుంది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో చెప్పిన విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ కులాలకు రాజకీయ ప్రాతిని రిజర్వేషన్లని పెంచుతామని చెప్పిన విధంగా బీసీ కులగనన పూర్తిస్థాయిలో చేపట్టిన తర్వాతనే ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుంది.లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ కులాలని ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాగట్ల చందు,జిల్లా ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి జిల్లా కోశాధికారి డివి రాజు దుబ్బాక మండల అధ్యక్షులు అనిల్ మిరుదొడ్డి మండల ప్రధాన కార్యదర్శి నవీన్ తోగుట మండల అధ్యక్షులు ప్రశాంత్ అక్బుర్ పేట భూంపల్లి మండల అధ్యక్షుడు కనక మల్లేశం వివిధ మండలాల నాయకులు కనకరాజు శ్రావణ్ స్వామి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### పాములపర్తి తాజా మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి



వాయిస్ టుడే సెప్టెంబర్ 29 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామనికి చెందిన చెక్కలి బలమని మరియు శార్దని మలేష్ అనారోగ్యంతో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న తాజా మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. మర్కుక్ మండల్ అధ్యక్షుడు కనకయ్య గౌడ్ క్రాంతికుమార్,రాజయ్య,కిషన్,లక్ష్మణ్,చెక్కలి కిష్టయ్య,చెక్కలి చంద్రం,లెంకలి అశోక్,నాగరాజు,యాదయ్య,శేఖర్,తదితరులు పాల్గొన్నారు

## ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వెళ్తున్న బస్సులో 10 వ తరగతి (ఎస్ ఎస్ సి మెమో ) పోగొట్టుకున్న ప్రజ్ఞాపూర్ వాస్తవ్యులు



వాయిస్ టుడే సెప్టెంబర్ 29 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వెళ్తున్న( ఆర్టీసీ) బస్సులో కోడమల్ల కన్యాకుమారి అనే యువతి తన 10 వ తరగతి రోల్ (రూల్ NO:2018109831) గల ( ఎస్ ఎస్ సి మెమో )పోగొట్టుకున్నది. బస్సు చాలా రద్దీగా వుండే సరికి తను దిగవాల్సిన బస్ స్టాప్ రాగానే మెమో వున బ్యాగ్ మరిచి పోయి తొందర తొందరగా బస్సు దిగడం జరిగింది .కొద్దీ సేపటి తరువాత అంతలోనే గుర్తుకు తెచ్చుకుని బ్యాగ్ కోసం బస్సు ను వేతకగా కనిపించలేదు , బ్యాగ్ తో పాటు అందులో ఉన్న( ఎస్ఎస్సి మెమో) కూడా పోయిందని వాపోయి చుట్టూ పక్కల అంతటా వెతికిన దొరకలేదు

## యాదగిరిగుట్టలో లాడ్జీను తనిఖీలు చేసిన పోలీసులు

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట:యాదగిరిగుట్ట పట్టణ పరిధి లోని లాడ్జీలను టౌన్ సీఐ రమేష్ కుమార్, ఎస్ఐ రమేష్ పోలీస్ సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు నిర్వహించారు.. అద్దె గదులలో ఉన్న సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. లాడ్జీ రికార్డ్ బుక్స్ లలో బసచేసిన వారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.ఆధార్ కార్డు ఉంటేనే రూమ్స్ ఇవ్వాలని, జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సీఐ రమేష్ కుమార్..




# సత్య సాయిని కాదని ఏలూరు నుంచి గతంలో నీళ్లు తెచ్చారు

### సత్యసాయి పథకానికి పూర్వ వైభవం తీసుకొస్తాం

### 360 కిలోమీటర్ల దూరంలో ఏలూరు నుంచి నీటిని గతంలోనే వ్యతిరేకించాం

### మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మక్తల్ సెప్టెంబర్29 వైస్ టుడే ప్రతినిధి: మక్తల్ నియోజవర్గం పక్కనే కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది నుంచి నీటిని తీసుకొచ్చే సత్యసాయి పథకాన్ని కాదని... ఎక్కడో 360 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం బ్యాక్ వాటర్ సమీపంలో ఏలూరు నుంచి నీటిని తీసుకువచ్చే మిషన్ భగీరథ పథకాన్ని గతంలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పూర్తిగా వ్యతిరేకించామని... మిషన్ భగీరథ పై పూర్తిగా ఆధారపడి సత్యసాయి పథకాన్ని నిర్లక్ష్యం చేశారని దాని ఫలితంగానే మక్తల్ తో పాటు ఇతర నియోజకవర్గంలోనూ నీటి ఎద్దడి సమస్య వచ్చిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు. గత 20 ఏళ్లుగా మక్తల్ తో పాటు 100కు పైగా గ్రామాలకు తాగునీటినందిస్తున్న సత్యసాయి పథకాన్ని పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకొస్తామని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. 1999లో సత్యసాయి తాగునీటి పథకం పనులు ప్రారంభించి 2001లో పూర్తిచేసి ..దాదాపు 42 కోట్ల రూపాయల వ్యయంతో 112 గ్రామాలకు నీళ్లు ఇచ్చేవారని అన్నారు. మూడు క్లస్టర్లలో భాగంగా మక్తల్ క్లస్టర్లో 86 గ్రామాలు, జూరాల క్లస్టర్లో 18 గ్రామాలు, జడ్చర్ల క్లస్టర్ లో 8 గ్రామాలకు నీళ్లు ఇచ్చారని.. 2001లో ఈ పథకాన్ని ఆర్డబ్ల్యూఎస్ కు అప్పగించారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కమిటీ ఏర్పాటు చేసి, కలెక్టర్ చైర్మన్గా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ కార్యదర్శిగా, మక్తల్ ,అమరచింత, జడ్చర్ల ఎమ్మెల్యేలు, ఎస్పీ ,సత్యసాయి ట్రస్ట్ మెంబర్ ను సభ్యులుగా నియమించారని తెలిపారు. 2019 వరకు సత్యసాయి తాగునీటి పథకాన్ని ఎల్ అండ్ టీ కంపెనీ చూసిందని .. ఆ తర్వాత మిషన్ భగీరథంలో విలీనం చేశారని అన్నారు. 2022 వరకు మెగా కంపెనీ మెయింటెనెన్స్ చేయగా.. ఆ తర్వాత పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. గతంలో 2017లో సత్యసాయి పైప్ లైన్ డామేజ్ అయితే దాదాపు మూడు నెలలపైగా నీటి సరఫరా ఆగిందని.. అప్పట్లో పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపట్టారని.. చివరకు అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రోస్ 46 లక్షలతో పైప్ లైన్ పునరుద్ధరించి నీటిని అందించారని గుర్తు చేశారు. 360 కిలోమీటర్ల దూరంలో ఏలూరు నుంచి నీళ్లు తీసుకురావడం కరెక్టా.. లేక 25 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నది నుంచి సత్యసాయి పథకం ద్వారా నీళ్లు తీసుకురావడం సరైన పద్ధతా అనేది ప్రజలే తేల్చి చెప్పాలని అన్నారు. సత్యసాయి పథకాన్ని పునరుద్ధరించి మక్తల్ ప్రాంత ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు 430 కోట్లతో రామన్ పాడు తరహాలో సంగంబండ నుంచి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసుకొని మక్తల్ నియోజకవర్గంకు పూర్తిస్థాయిలో... నారాయణపేట, దేవరకద్రలకు పాక్షికంగా నీటిని అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేస్తామని భరోసా ఇచ్చారు. గతంలోనే ఏలూరు నుంచి నీళ్లు తేవడాన్ని తాను జడ్పిటిసిగా ఉన్నపుడే వ్యతిరేకించానని... సత్య సాయి పథకాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసి ఇప్పుడు తమపై బురద చల్లాలని అనుకోవడం సరికాదని హితవు పలికారు. మక్తల్ ప్రాంత ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యే అయ్యానని.. మక్తల్ ప్రజలకు సేవ చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని.. నీటి సమస్యపై శాశ్వత పరిష్కారం దిశగా తన చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి ,చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్ కుమారగుప్తా, బి.గణేష్ కుమార్,బోయ రవికుమార్, గొల్లపల్లి నారాయణ, ఆనంద్ గౌడ్, సాయి ఫైనాన్స్ శీను ,%ఎ%.నాగేందర్, వల్లంపల్లి లక్ష్మణ్ , కావలి తాయప్ప, మహమ్మద్ నూరుద్దీన్, మందుల నరేందర్ ,అబ్దుల్ రెహమాన్, ఫయాజ్, శంషాద్దీన్, గుడెబల్లూర్ నాగరాజ్ ,సాదిక్, వాకిటి శ్యామ్, అఫ్రోజ్, పూజ శివ, సురేష్ కుమార్, కల్లూరి గోవర్ధన్, మిస్కిన్ నాగరాజ్, అశోక్ గౌడ్, తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.